

కనకమ్మకు నీరాజనం



▸▸ తొలి గురువారం పూజలకు పోటెత్తిన భక్తులు

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం పూజలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులుతీరి నిల్చొని అమ్మను దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లా వాసులతో పాటు ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి వెల్లువలా తరలిరావడంతో బురుజుపేట వీధులు కిక్కిరిశాయి. అభిషేకాల అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నగరానికి చేరుకున్న సీఎం

- ▸▸ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన నేతలు
- ▸▸ పార్టీ కార్యాలయంలో బస

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి విశాఖపట్నం చేరుకున్న ఆయనకు ఎయిర్‌పోర్టులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, , ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు గండి బాబ్జీ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, సీపీ శంకబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డీఐజీ గోపినాథ్ జట్టీ, వీఎంఆర్‌డీ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీసీపీ మేరీ ప్రశాంతి, తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎయిర్‌పోర్టు నుంచి చంద్రబాబునాయుడు పార్టీ కార్యాలయానికి చేరుకుని, ప్రాంగణంలో నిలిపివుంచిన బస్సులో బస చేశారు.

నేడు డీప్ టెక్నాలజీ సదస్సుకు హాజరు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. 9.25 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి 9.30 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుని 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. సాయంత్రం 6.15 గంటలకు నోవాటెల్ నుంచి

... మిగతా 6వ పేజీలో



నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



విమానాశ్రయంలో సీఎం చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

రూ.లక్షల్లో వసూలుచేస్తున్న కొన్ని ఐటీ కంపెనీలు

- ▸▸ ఇటీవల రూ.3 లక్షల వరకూ తీసుకుని బిచాణా ఎత్తేసిన ఓ సంస్థ
- ▸▸ షూరిటీ పేరిట రూ.3 లక్షలు చెక్కులు తీసుకున్న మరో సంస్థ
- ▸▸ ఎందుకూ పనికి రారంటూ వేధింపులు
- ▸▸ ఉద్యోగం మానేస్తామంటే రూ.లక్షలు కట్టాలని డిమాండ్
- ▸▸ పోలీసులను ఆశ్రయించినా ప్రయోజనం శూన్యం
- ▸▸ యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ సెటిల్‌మెంట్
- ▸▸ ఉద్యోగం కోసం డబ్బులు అడిగితే... ఆ సంస్థను అనుమానించాల్సిందేనంటున్న ఐటీ నిపుణులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో కొన్ని ఐటీ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయి. ఉద్యోగార్థుల నుంచి డబ్బు దోచుకోవడానికి యత్నిస్తున్నాయి. వాటికి పోలీసులు సహకరిస్తున్నారు. నగరంలోని ఒక పోలీస్ స్టేషన్‌లో కొద్దిరోజుల క్రితం ఇలాంటి కేసు ఒకటి సెటిల్‌మెంట్ జరిగింది. ఉద్యోగం మానేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు చొప్పున యాజమాన్యం ముక్కుపిండి వసూలుచేసింది. ఇది నగరంలో కొత్త ట్రెండ్.



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం స్లంపులో ఉంది. అందరికీ ఉద్యోగ అవకాశాలు రావడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోను అదే పరిస్థితి. ఉత్తరాంధ్రాలో బీటెక్ చేసి బయటకు వస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటోంది. దీనిని కొన్ని కంపెనీలు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నాయి. ఐటీలో ఉద్యోగాలు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నాయి. ఫలానా కంపెనీ, ఫలానా తేదీన ఇంటర్వ్యూలు అని చెప్పి రప్పించుకుంటున్నాయి. ఉద్యోగం కావాలంటే కంపెనీకి డిపాజిట్ కట్టాలంటూ లక్ష రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకూ కట్టించుకుంటున్నాయి. ఆఫర్ లెటర్ ఇచ్చి, ఆ తరువాత అడ్రస్ లేకుండా పోతున్నాయి. డబ్బులు కట్టినవారు ఇంటర్వ్యూ జరిగిన ఆఫీసుకు వెళ్లి అడిగితే...ఆ ఒక్కరోజుకు వారికి అద్దెకు ఇచ్చామని, అది వారి ఆఫీస్ కాదని చెబుతున్నారు. గ్రీన్ పార్క్ హోటల్ సమీపాన పెద్ద భవంతిలో ఈ తరహా మోసం

... మిగతా 6వ పేజీలో

ఇలా చేస్తే మోసం చేస్తున్నట్టే..!

- ఏ కంపెనీ అయినా ఉద్యోగం ఇస్తామని చెప్పి డబ్బులు వసూలు చేయకూడదు. అలా చేస్తే మోసం చేస్తున్నట్టే భావించాలి.
- గ్యారంటీ, డిపాజిట్ పేరుతో అడ్వాన్స్ చెక్కులు కూడా తీసుకోకూడదు.ఇది క్రిమినల్ కేసు కిందకు వస్తుంది. ఇది కూడా మోసమే.
- శిక్షణ ఇచ్చాక ఉద్యోగం ఇస్తామని కొన్ని సంస్థలు చెబుతాయి. ఆ శిక్షణకు డబ్బులు వసూలు చేస్తాయి. ఇలాంటి అంశాల్లో క్లారిటీ అవసరం. అది ట్రైనింగ్ ఇనిస్టిట్యూటా?, ఐటీ కంపెనీయా?...అని ధ్రువీకరించుకోవాలి. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగాలు ఇవ్వని సంస్థలు అనేకం ఉన్నాయి.

రింగు వలలతో చేపల వేట నిషేధం

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో రింగు వలలతో చేపల వేటపై నిషేధం ఉందని, మత్స్యకారులు ఎవరూ వాటితో వేటకు వెళ్లకూడదని జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు గురువారం ప్రకటనలో తెలిపారు. రింగు వలలతో వేటకు వెళ్లాలంటే ప్రత్యేకమైన లైసెన్స్ ఉండాలని, వారు కూడా తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల పరిధి దాటి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఆ బోట్లకు తప్పనిసరిగా ట్రాన్స్‌పాండర్ పరికరం అమర్చాకే వేట చేయాల్సి ఉంటుందన్నారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం రింగు వలలతో వేటాడేందుకు ఎవరికీ అనుమతులు లేవని, వాటిని పూర్తిగా నిషేధించామని వివరించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా రింగు వలలు ఉపయోగించినట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు నీతి ఆయోగ్ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నాన్ని గ్రోత్ హబ్ (అభివృద్ధి కేంద్రం)గా అభివృద్ధి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నీతి ఆయోగ్ సమావేశం నిర్వహించనున్నది. గతంలో నిర్వహించిన సమావేశాల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అధికారులు ఇచ్చిన

... మిగతా 6వ పేజీలో

ట్రాయ్ పేరుతో కాల్స్

సైబర్ నేరగాళ్ల కొత్త వ్యూహం

- ▸▸ పరిమితికి మించి కాల్స్ మాట్లాడుతున్నందున నంబర్ బ్లాక్ చేస్తున్నట్టు ఫోన్
- ▸▸ అదే నంబర్ రెన్యువల్ చేయించుకోవాలని సలహా
- ▸▸ ఫోన్‌కు వచ్చే ఓటీపీ నంబర్ చెబితే సరిపోతుందంటూ వల
- ▸▸ ఓటీపీ చెప్పగానే ఫోన్‌ను హ్యాక్ చేస్తున్న నేరగాళ్లు
- ▸▸ ఫోన్‌లోని డేటా ఆధారంగా బ్యాంక్ ఖాతాలు లూటీ
- ▸▸ నగరంలో పెరుగుతున్న బాధితులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరదీశారు. టెలికాం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) పేరుతో ఫోన్ చేసి అమాయకులను బెదిరించి వారి బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు. నగరంలో ఈ తరహా మోసాలకు గురైన బాధితులు పలువురు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ టీ దుకాణం నుంచి షాపింగ్‌మాల్ వరకూ అన్నిచోట్ల ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా నగదు చెల్లింపులు జరుపుతున్నారు. అయితే భారీమొత్తంలో లావాదేవీలు జరిపేవారు నెట్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటారు. అందుకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వంటివి ఉంటాయి. కొందరు ఈ రహస్య సమాచారాన్ని తమ మొబైల్ ఫోన్‌లోనే నిక్షిప్తం చేసుకుంటున్నారు. దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అవకాశంగా మార్చుకుంటున్నారు.

ఇప్పటివరకూ ఫెడెక్స్ కొరియర్, సీబీఐ, కస్టమ్స్ అధికారులమంటూ వాట్సాప్ కాల్స్ ద్వారా ఫోన్‌లు చేసి అమాయకుల నుంచి డబ్బులు గుంజిన మోసగాళ్లు..దీనిపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పంథా మార్చేశారు. ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ పరిచయం చేసుకుంటున్నారు. 'మీరు కాల్స్ పరిమితికి మించి మాట్లాడుతుండడంతో నంబర్ బ్లాక్ చేయబోతున్నాం. ఒకవేళ ఇదే నంబర్‌ను రెన్యువల్ చేసుకోవాలనుకుంటే మీ ఫోన్‌లో ఒకటి నొక్కండి.' అని సూచిస్తున్నారు. నిజమేనని భావించి ఎవరైనా తమ ఫోన్‌లో ఒకటి నొక్కగానే 'మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది' చెప్పాలని అడుగుతున్నారు. ఓటీపీ నంబర్ చెప్పగానే ఫోన్ సైబర్ నేరగాళ్ల యాక్సిస్‌లోకి వెళుతుంది. ఆ సమయంలో ఫోన్‌లో బ్యాంకు వివరాలు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఉన్నట్టయితే వాటి ఆధారంగా ఖాతాలను ఖాళీ చేస్తున్నారు.

నగరంలో పెరుగుతున్న బాధితులు

నగరంలో ఈ తరహా మోసాలకు గురవుతున్న బాధితులు పెరుగుతున్నారు. ప్రస్తుతం అపరిమిత కాల్‌డేటా ఆఫర్ల

... మిగతా 6వ పేజీలో

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

- ▸▸ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు
- ▸▸ విక్రయించినా, వినియోగించినా జరిమానా
- ▸▸ 'ప్లాస్టిక్ రహిత విశాఖ' కోసం బీచ్‌రోడ్డులో ప్రతిజ్ఞ రేపు
- ▸▸ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్



విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. నగరంలో ప్రతిరోజూ 300 టన్నుల వరకూ ప్లాసిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. వాటిని శాస్త్రీయంగా పునర్వినియోగించుకునే అవకాశం లేకపోవడం సమస్యగా మారుతోందన్నారు. ప్లాసిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కనీసం 500 సంవత్సరాలు పడుతుందని, వర్షాలు పడితే నీటితో కలిసి గెడ్డలు, కాలువల ద్వారా సముద్రంలో చేరుతున్నాయన్నారు. దీనివల్ల పర్యావరణం, సముద్ర జలాలు కలుషితమవుతున్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని నిర్ణయించామన్నారు. వచ్చే నెల ఒకటి నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నగరంలో విక్రయించడం, వినియోగించడం నిషేధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలతోపాటు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈలోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల ఏడో తేదీ ఉదయం 6.30 గంటలకు బీచ్‌రోడ్డులో 'ప్లాస్టిక్ రహిత విశాఖ' పేరుతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞ నిర్వహిస్తామన్నారు. ఈ

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ నిర్వహణ

- ▸▸ వినతులు ఆన్‌లైన్‌లో నమోదు
- ▸▸ 45 రోజుల్లోగా పరిష్కారమయ్యేలా చర్యలు
- ▸▸ మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ రేపు
- ▸▸ కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు అధికారులు వెళ్లి సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ప్రధాన ఉద్దేశమన్నారు. 22-ఏ, యూఎల్‌సీ వంటి భూవివాదాలతోపాటు ఇతర రెవెన్యూ అనుబంధ సమస్యలు ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చునన్నారు. సదస్సుల్లో రెవెన్యూ, అటవీ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, రిజిస్ట్రేషన్, వక్ఫ్ అధికారులు అన్ని రికార్డులతో పాల్గొంటారన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదులను



కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఆయా గ్రామాలకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. గతంలో కేటాయించిన ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూముల వివాదాలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. 22-ఏలో ఉన్న ప్రభుత్వ, జిరాయితీ భూములకు సంబంధించిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఫ్రీ హోల్డ్, 22-ఎ భూఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులు స్వీకరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల లో వచ్చిన వినతులు రోజువారీ ఆన్‌లైన్‌లో

... మిగతా 6వ పేజీలో

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

- ▸▸ డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న మూడో సెమిస్టర్ పరీక్షల్లో తప్పిదాలు
- ▸▸ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ పేపర్
- ▸▸ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సు విద్యార్థులకు ఫుడ్ అండ్ టెక్నాలజీ పేపర్
- ▸▸ కంగుతిన్న విద్యార్థులు



విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. తాము చదువుతున్న కోర్సు ఒకటైతే పరీక్షల్లో మరో కోర్సుకు సంబంధించిన ప్రశ్నలు అడగడంతో విద్యార్థులు తెల్లబోవాల్సివచ్చింది. వివరాల్లోకి వెళితే.. యూనివర్సిటీ పరిధిలోని కాలేజీల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల ఒకటో తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నారు. నాలుగో తేదీన బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు చదువుతున్న విద్యార్థులకు కెమిస్ట్రీ ఆఫ్ ఫ్యాట్స్ అండ్ ఆయిల్స్ పరీక్ష నిర్వహించారు. అయితే పేపర్ చూసిన విద్యార్థుల కంగుతిన్నారు. పేపర్‌పై కోర్సు, పేపర్ వివరాలను స్పష్టంగా పేర్కొన్న వర్సిటీ అధికారులు..

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి భీమిలిలో రెవెన్యూ సదస్సులు

భీమునిపట్నం,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం నుంచి జనవరి 8 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పి. రామారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ సదస్సులు జరుగుతాయన్నారు. 6న భీమిలి మండల పరిషత్ కార్యాలయంలోనూ, 9న చిట్టివలస,10న దాకమర్రి, 11న జేవీ అగ్రహారం, 12న కొత్తవలస, 13న కాపులుప్పాడ, 16న కేవీ భూములు,17న కుమ్మరిపాలెం, 18న సంగివలస,19న తాళ్లవలస, 20న తాటితూరు, 21న తగరపువలస, 23న అమనాం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. అలాగే 24న అన్నవరం, 26న బోడమెట్టపాలెం, 27న చిప్పాడ, 28న రామయోగి, అగ్రహారం, 30న నిడిగట్టు, 31న నేరేళ్లవలస, జనవరి 2న టి. నగరపాలెం, 3న సింగనబంద, 4న మజ్జివలస, 6న చేపలుప్పాడ, 7న మూలకుద్దు, 8న నారాయణరాజుపేటలో సదస్సులు జరుగుతాయని తెలిపారు. రైతులు, ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 6న గొట్టిపల్లి, 7న కుసులువాడ, 9న గిడిజాల, 10న ఆనందపురం, 11న రామవరం, 12న దబ్బంద, 13న కణమాం, గోరింట, 16న ఎస్‌జీఆర్ పురం-2, 17న ఎస్‌జీఆర్ పురం, 18న భీమన్నదొరపాలెం, 19న కోలవానిపాలెం, 20న పాలవలస, 21న పందలపాక,బాకురుపాలెం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని చెప్పారు. అలాగే 23న గుడిలోవ, 27న తర్లువాడ, 28న చందక, 30న జగన్నాథపురం, 31న ముకుందపురం, పేకేరు, 2న లోడగలవానిపాలెం, 3న పెద్దిపాలెం, వెల్లంకి, 4న గండిగుండం, 6న గంభీరం, 7న తంగెడుబిల్లి, ముచ్చర్ల, 8న శిర్లపాలెం, బోని గ్రామాల్లో సదస్సులు ఉంటాయని ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సు వాయిదా

పద్మనాభం : మండలంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ డే ఉండడం వల్ల ఆ రోజు పొట్నూరు గ్రామంలో నిర్వహించాల్సిన రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్టు తహసీల్దారు కె. ఆనందరావు తెలిపారు. సదస్సును ఈనెల 9న నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

నేటి నుంచి చదరంగం పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌కుమార్

ఎండాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు సౌత్ జోన్ స్థాయిలో మహిళల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు. విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన జిమ్‌సర్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 65 వర్సిటీల నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్టు తెలిపారు. అలాగే వంద మంది మేనేజర్లు, పది మంది అధికారులు పాల్గొంటారన్నారు. గీతం వైద్య కళాశాలలోని ఎల్లా ప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గీతం క్రీడా విభాగం మేనేజర్ రితేశ్ సిన్హా, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

సాగర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్ నగర్‌లో జిల్లా మలేరియ శాఖాధికారి తులసీరాజ్ గురువారం పర్యటించారు. ఈప్రాంతంలో మలేరియా కేసు నమోదు కావడంతో అధికారులను అప్రమత్తం చేశారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లోనూ పరిశుభ్రతపై దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు ఎక్కడా నిలిచిపోకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు అధికారులు నగేశ్, మంగరాజు ఉన్నారు.

'టెక్ కాన్‌క్లేవ్'లో గీతం విద్యార్థుల ప్రతిభ

సాగర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నోవాటెల్‌లో టెక్నోవేట్‌ఫర్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం జరిగిన టెక్‌కాన్‌క్లేవ్-2024లో గీతం విద్యార్థులు ప్రతిభ చూపారు. సీఎస్‌ఈ విద్యార్థి పి. జగదీశ్, సీఎస్‌బీఎస్ విద్యార్థి ఎస్. గిరీశ్‌కుమార్ బృందంగా ఏర్పడి ఈ-ఉపద్‌పేరిట సరికొత్త ప్రాజెక్టును రూపొందించారు. చిన్న ఐటీ ప్రాజెక్టులు నిర్వహించే వారికి సులభతరంగా చెల్లింపు విధానం, వీడియోలు, ఇతర గుర్తింపు పత్రాలను తేలిగ్గా కృత్రిమ మేధతో ఉపయోగించే పద్ధతులను ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈమేరకు నిర్వాహకులు వారిని విజేతలుగా ప్రకటించారు. విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఎస్ రాజ్‌కుమార్, సీఎస్‌ఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ లక్ష్మీశ్వరి అభినందించారు.


ఎర్రమట్టిదిబ్బలకు వెళ్లే ప్రధాన రహదారి


ఎర్రమట్టిదిబ్బలను కప్పేసిన చెట్లు


పాడైన తాటి దుక్కలతో ఏర్పాటు చేసిన శాల

ఎర్రమట్టి దిబ్బల్లో అభివృద్ధి మాయం

- కొన్నేళ్లుగా కొరవడిన నిర్వహణ
- గత ఐదేళ్లలో రూపాయి కూడా ఖర్చు చేయని వైసీపీ
- సందర్శలకు కానరాని సౌకర్యాలు

భీమునిపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఎర్రమట్టిదిబ్బల్లో సందర్శకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణ, నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దక్షిణాసియాలోనే అరుదైన హెరిటేజ్ సైట్‌గా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎర్రమట్టిదిబ్బలను గుర్తించింది. ప్రతిరోజూ వీటిని వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి ఎందరో పర్యాటకులు వస్తుంటారు. అయితే పర్యాటకులకు ఇక్కడ ఏవిధమైన సౌకర్యాలు లేవు. బీచ్ రోడ్‌లో వున్న ఎర్రమట్టిదిబ్బల్లో ప్రవేశించడానికి ఎక్కడా సరైన రహదారి లేదు. ఒకవేళ ఎక్కడైనా రోడ్డు వున్నా ఇరువైపులా దట్టమైన చెట్లు, పొదలు పెరిగిపోయాయి. ఎంతదూరం నడచివెళ్లినా దిబ్బల్లో గుబురుగా పెరిగిన చెట్లు, తుప్పలే కనిపిస్తాయి.బీచ్‌రోడ్ మీదుగా ఐఎన్ఎస్ కళింగ, ఎన్ఏడీ వెనుక భాగం నుంచి నేరేళ్లవలస, నిడిగట్టు, రామయోగి అగ్రహారం, జేవీ అగ్రహారం మీదుగా వెళ్లి పదేళ్ల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యూపాయింట్ వద్దకు వెళితే తప్ప ఎర్రమట్టి దిబ్బలు కనిపించవు. 12 ఏళ్ల క్రితం ఇక్కడ సందర్శకుల సౌకర్యార్థం తాటి దుక్కలు, ఆకులతో పది పగోడాలు నిర్మించారు. ఇపుడు అవన్నీ పాడయ్యాయి. మంచినీటి సదుపాయం కూడా ఉండదు. పొదలు, చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

గాయకుడు సన్యాసిరాజు మృతి పట్ల నివాళి

భీమునిపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన గాయకుడు అడిదం సన్యాసిరాజు శబరిమలైలో మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం ఉదయం ఇక్కడికి తీసుకువచ్చారు. 30 ఏళ్లుగా అయ్యప్ప పరమ భక్తుడిగా, గురుస్వామిగా, గాయకుడిగా గుర్తింపు పొందారు. వృత్తిరీత్యా నగరంలోని ఒక రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తూ, ప్రవృత్తిగా పాటలు పాడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

రైల్వే స్టేషన్‌కు లింక్ బస్సులు నడపాలి

భీమునిపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి రైల్వేస్టేషన్‌కు సిటీ బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి బీచ్ రోడ్‌లో 900కె సిటీ బస్సు మాత్రమే స్టేషన్‌కు వెళుతుంది. ఇది స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండడం లేదు. ముఖ్యంగా స్టేషన్‌లో వందేభారత్, జన్మభూమి బయలుదేరే సమయానికి ఇక్కడి నుంచి లింక్ సిటీ బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు.

అందరికీ వైద్యం.. ప్రభుత్వం లక్ష్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి


రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

మధురవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అందరికీ వైద్యం.. ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పద్మావతి అన్నారు. వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తున్న రోగులందరికీ మెరుగైన సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. గురువారం ఆమె మధురవాడ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే వారికి సక్రమంగా సేవలందించాలన్నారు. మందుల స్టాక్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని వైద్యాధికారి ప్రశాంతికి సూచించారు. అనంతరం ఆమె పీహెచ్‌సీ పరిధిలో క్షయ నివారణకు చేపట్టిన చర్యలు, పిల్లలకు ఇమ్యూనైజేషన్ టీకాలు, గర్భిణిలకు అందుతున్న సేవలు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోపీనాథ్, వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువా రం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు బంగారు సంపెంగలతో పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నగరానికి చేరుకున్న సీఎం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 6.45 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

ఇన్‌చార్జి మంత్రిని అడ్డుకున్న పోలీసులు

సీఎం చంద్రబాబు సీరియస్

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులను కూడా లోపలకు అనుమతించలేదు. ఆ సమయంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది కూడా అతిగా ప్రవర్తించడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం సీఎంకు వెలగపూడి ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులను లోపలకు రాకుండా ఎలా ఆపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని మందలించారు. తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులను అనుమతించాలని చంద్రబాబు ఆదేశించారు.


ప్రణవ్‌గోపాల్‌కు శుభాకాంక్షలు చెబుతున్న శివాజీ, తదితరులు

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

మధురవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ కోరారు. గురువారం ఆయన నగరంలో ప్రణవ్‌గోపాల్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన ప్రసాద్, పిళ్లా మోహనకృష్ణ, టీఎన్ఎస్ఎఫ్ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు రత్నకాంత్ పాల్గొన్నారు.

వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం/పద్మనాభం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను అధికారులు విజయవంతం చేయాలని తహసీల్దార్ కె. ఆనందరావు ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదస్సుల్లో ప్రజల నుంచి రెవెన్యూపరమైన సమస్యలతో పాటు ఇతర అంశాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించనున్నట్టు చెప్పారు. జనవరి 8 వరకు జరిగే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉపతహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఆర్ఐ శ్యామల, సర్వే డీటీ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు



సింహాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేపగుంటలోని శంకర్ ఫౌండేషన్‌కు చెందిన వైద్యులు సింహాచలం ఉద్యోగులకు గురువారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. సింహగిరిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 159 మందికి పరీక్షలు జరిపారు. అందులో 24 మందికి కళ్లద్దాలు ఇవ్వగా, ఐదుగురిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఏఈఓ ఎన్. ఆనందకుమార్, శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది డా. రాహుల్, ఎం. చంద్రశేఖర్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ప్రశ్నలు మాత్రం ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సుకు సంబంధించినవి ఇచ్చారు. విద్యార్థులు విషయాన్ని ఇన్విజిలేటర్‌కు తెలియజేశారు. అయితే, ఆయా కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు పరీక్ష హాల్ నుంచి వెళ్లడానికి లేదని, అబ్జర్వర్‌కు విషయాన్ని తెలియజేశామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతామని, పరీక్షకు హాజరైనట్టు హాల్ టికెట్ నంబర్లు వేసి ఇవ్వాలని అబ్జర్వర్లు సూచించారు. కాలేజీ యాజమాన్యాల ద్వారా ఈ విషయాన్ని ఏయూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు పలువురు గురువారం ఉదయం వర్సిటీకి వెళ్లి ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేసినప్పటికీ అవకాశం ఇవ్వలేదని తెలిసింది.

అదే తప్పు..

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గురువారం కూడా అదే తప్పిదం జరిగింది. ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సు చదివే విద్యార్థులకు ఫంక్షనల్ ఫుడ్ అండ్ న్యూట్రిస్యూటికల్స్ పరీక్ష నిర్వహించాలి. అయితే, జరిగిన ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులోని కెమిస్ట్రీ అండ్ ఫ్యాట్స్ అండ్ ఆయిల్స్ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలను ఇచ్చారు. కోర్సు పేరు, పేపర్ వివరాలను ఒకలా, అందులో ఇచ్చిన ప్రశ్నలు మరోలా ఉండడంతో విద్యార్థులు కనీసం పెన్ను కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఏయూ వీసీ ప్రొఫెసర్ జి శశిభూషణరావును వివరణ కోరగా తప్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూస్తామని, అవసరమైతే పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి : సీపీ


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న సీపీ

జగదాంబ కూడలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమ్మవారి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. విక్టోరియా వద్ద పార్కింగ్‌ను, క్యూ లైన్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఏసీపీ కాళిదాసు, వన్‌టౌన్ సీఐ దేముడుబాబు, ఈవో కె. శోభారాణి, ఇంజనీరు రమణ ఉన్నారు.

'మెగా పేరెంట్స్ డే విజయవంతం చేయాలి'

పద్మనాభం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ డే నిర్వహించనున్నట్టు ఎంఈఓలు రమణ, బాబూలాల్ చెప్పారు. గురువారం వారు మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.

27 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎండాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఆర్‌హెచ్ కాలనీలో కసిరెడ్డి రాము వద్ద 21 బాటిళ్లు, అదే కాలనీలో ఆంజనేయస్వామి గుడి ప్రాంతంలో ఉన్న నీలపు లక్ష్మి వద్ద నుంచి 6 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదు చేస్తామన్నారు. సదస్సుల్లో వచ్చిన వినతులు 45 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ రేపు

జిల్లాలోని 595 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల7వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రాలను సంబంధిత హెచ్‌ఎం ద్వారా తల్లిదండ్రులకు పంపామన్నారు. మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రుల సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల చదువు, క్రమశిక్షణ గురించి తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు.అందువల్ల తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ భవానీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సంగివలస సర్వీసులో కిక్కిరిసిన ఆర్‌టీసీ బస్సు

అరకొర బస్సులతో అవస్థలు

తగరపువలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అరకొర సిటీ బస్సులతో విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తగరపువలసలో అనేక ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండడంతో ఉదయం, సాయంత్రం బస్సులు ఖాళీగా ఉండడం లేదు. ఉదయం 8 నుంచి 10 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు బస్సులన్నీ విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి దీనివల్ల సాధారణ ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం నిల్చోవడానికి కూడా అవకాశం ఉండడం లేదు. వృద్ధులు, మహిళల అవస్థలు వర్ణనాతీతం. పాఠశాలలు, కళాశాలలు తెరిచే సమయంలోనూ, మూసే సమయంలోనూ అదనపు సర్వీసులు నడపాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో కోరుతున్నా.. ఆర్‌టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

పడవల నిలిపివేతకు స్థలం కేటాయించాలి


నాగమయ్యపాలెం వద్ద పడవలు నిలిపే ప్రాంతం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగమయ్యపాలెం తీరంలో చేపల పడవల నిలిపివేతకు స్థలం కేటాయించాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు. ఇక్కడి మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి అక్కడ సమీపంలో ఉన్న గోస్తనీ నదిలో పడవలు నిలుపుదల చేస్తున్నారు. నది నుంచి ఇసుకలో పడవలను తొసుకువచ్చి మళ్లీ సముద్రంలోకి తీసుకువెళ్లడం ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. దీనవల్ల చాలామంది తమ పడవలను భీమిలిలో ఉంచి ప్రతిరోజూ ఉదయం వేటకు వెళ్లి, మళ్లీ వచ్చిన తర్వాత పడవలను అక్కడే ఉంచి గ్రామానికి వెళుతున్నారు. ఇటీవల డీవీస్ రుణ సహాయంతో పడవలకు విద్యుత్ మోటార్లు అమర్చుకున్నారు. ఈ పడవలను సముద్రంలోకి తీసుకువెళ్లడం ఎంతో కష్టంగా ఉంటోంది. ఈనేపథ్యంలో పడవలను స్థానికంగా నిలిపివేయడానికి స్థలం కేటాయించాలని మత్స్యకారులు అధికారులను కోరుతున్నారు.

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

... 5వ పేజీ తరువాయి

కొద్దినెలల క్రితం జరిగింది. వారి చేతిలో 40 మంది వరకు మోసపోయారు. సుమారు రూ.70 లక్షల వరకు వసూలు చేసుకొని ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది.

ఉద్యోగం ఇచ్చాక వేధింపులు

నగరంలో ఉన్న ఓ ఐటీ కంపెనీ ఈ ఏడాది మార్చి నెలలో బీటెక్ పాసైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించింది. సుమారు 30 మందిని తీసుకుంది. వారికి అన్నీ కలిపి ఏడాదికి రూ.1.8 లక్షల జీతం ఇస్తామని ఆఫర్ లెటర్ ఇచ్చింది. అంటే నెలకు సుమారు రూ.15 వేల జీతం. ఎటువంటి అనుభవం లేనందున, శిక్షణ ఇవ్వాలి కాబట్టి, అది పూర్తయ్యాక వెళ్లిపోకుండా ఉండడానికి డిపాజిట్ కట్టాలని ఒత్తిడి పెట్టింది. కొందరి వద్ద రూ.3 లక్షలు, మరికొందరి వద్ద రూ.6 లక్షలు చొప్పున వారి తల్లితండ్రుల నుంచి అడ్వాన్స్ చెక్కులు తీసుకుంది. మూడు నెలల ప్రొబేషన్ తరువాత రెగ్యులర్ చేస్తామని, అప్పుడు జీతం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. యువతీ యువకులు ఉత్సాహంగా చేరారు. అయితే వారిలో 80 శాతం మందికి ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ఏ బాధ్యత అప్పగించలేదు. నెల నెలా జీతం మాత్రం ఇచ్చింది. ఏదైనా పని చెప్పాలని కొందరు కోరితే..'మీకు ఏమి చేతనవుతుంది? ఏమీ చేయలేరు.' అంటూ కంపెనీ ప్రతినిధులు ఎగతాళి చేయడం ప్రారంభించారు. తాము చేరి మూడు నెలలు దాటింది కాబట్టి జీతం పెంచాలని నలుగురైదుగురు కోరగా, 'ఇదే మీకు ఎక్కువ' అంటూ వెటకారం చేశారు. దాంతో తాము ఉద్యోగం మానేస్తామని, సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే వారిని మరింత వేధించడం ప్రారంభించారు. మూడు నెలల ముందు నోటీసు ఇవ్వడంతో పాటు రూ.3 లక్షలు కట్టాలని, అప్పుడే సర్టిఫికెట్లు, అడ్వాన్స్ చెక్కులు వెనక్కి ఇస్తామని నిబంధన పెట్టారు. ఇచ్చిన జీతం లక్ష రూపాయలు కూడా లేదని, మూడు లక్షలు ఎందుకు ఇస్తామని అడిగితే, నచ్చింది చేసుకోండి..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని ఓ ఎమ్మెల్యేను కలిసి జరిగిందంతా వివరించారు. ఆ కంపెనీ తన నియోజకవర్గంలోనే ఉండడంతో ఆ పోలీస్ స్టేషన్ అధికారికి ఫోన్ చేసి, పిల్లలకు న్యాయం చేయాలని సూచించారు. అక్కడ ఈ పంచాయితీ మూడు రోజులు నడిచింది. పిల్లలను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించుకొని కింది స్థాయి అధికారి యాజమాన్యానికి వత్తాసు పలికారు. ఈ విషయం మళ్లీ ఎమ్మెల్యేకు చెప్పడంతో, ఆయన స్టేషన్ అధికారికి మరోసారి ఫోన్ చేశారు. ఒక్కొక్కరు రూ.1.5 లక్షలు చొప్పున చెల్లిస్తే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ఒప్పుకోకపోవడంతో ఆ ఒప్పందం ప్రకారం ఆ కేసు సెటిల్‌మెంట్ చేశారు. డబ్బులు కట్టాకే వారి సర్టిఫికెట్లు వెనక్కి ఇచ్చారు.

ట్రాయ్ పేరుతో కాల్స్

... 5వ పేజీ తరువాయి

యుగం నడుస్తుండడంతో చాలామంది ఫోన్‌లోనే గడుపుతున్నారు. దీంతో ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని, పరిమితికి మించి కాల్స్ మాట్లాడుతున్నారని సైబర్ మోసగాళ్లు చెప్పేసరికి, బాధితులు నిజమేనని భావిస్తున్నారు. ఈ క్రమంలో అవతలివారు చెప్పినట్టు చేసి తమ ఫోన్ నంబర్ బ్లాక్ కాకుండా రెన్యువల్ చేసుకోవాలనుకుంటున్నారు. తీరా ఖాతాలు ఖాళీ అయిపోతుండడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ట్రాయ్, బ్యాంకుల పేరుతోగానీ, సీబీఐ, కస్టమ్స్ అధికారులమంటూ గానీ కొరియర్ వచ్చిందని గానీ ఎవరైనా ఫోన్ చేసినా, కేసు లేకుండా చేసేందుకంటూ డబ్బులు కావాలని అడిగినా ఎవరూ నమ్మకూడదని సైబర్ క్రైమ్ సీఐ బీఎండీ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు ఏదోవిధంగా మోసం చేసేందుకు యత్నిస్తుంటారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి బ్యాంకు ఖాతా వివరాలను బయటకు వెల్లడించవద్దని కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమానికి స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గతంలో పలుమార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించినప్పటికీ అనివార్య కారణాల వల్ల పూర్తిస్థాయిలో సాధ్యపడలేదన్నారు. కానీ ఇప్పుడు మాత్రం శతశాతం నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల ఉత్పత్తిని పెంచేందుకు వ్యాపారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల మార్కెట్‌కు కూడా అవకాశాలు కల్పిస్తామన్నారు. గతంలో వీటి ధరలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కంటే చాలా ఎక్కువ ఉండడంతో కొనుగోలుదారులు వాటి జోలికి వెళ్లేవారు కాదన్నారు. కానీ ఇప్పుడు వాటి ఉత్పత్తి భారీగా పెరగడంతో ధరలు కూడా గణనీయంగా తగ్గి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దాదాపు సమానంగా ఉంటాయన్నారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అందరూ విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నేడు నీతి ఆయోగ్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సమాచారం ప్రకారం ఏ విధమైన చర్యలు చేపట్టాలనే దానిపై నీతి ఆయోగ్ ఒక నివేదిక రూపొందించింది. దానిని బృందం జిల్లా అధికారులకు వివరించి, వివిధ శాఖలు ఏ విధంగా ముందుకువెళ్లాలో మార్గదర్శనం చేస్తుంది. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ బృందంతో పాటు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు పాల్గొంటారు.

☛ సంక్షిప్తంగా..

మ్యూజియంల సందర్శనకు ప్రవేశ రుసుము తగ్గింపు

సిరిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మ్యూజియం ప్రవేశానికి స్కూలు విద్యార్థులకు ప్రవేశ రుసుములో రాయితీ కల్పిస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలు నేటి, భావి తరాలకు చాటి చెప్పేలా 40 నిమిషాల నిడివితో లైట్ అండ్ మ్యూజిక్ ప్రదర్శనకు ప్రవేశ రుసుం గతంలో రూ.60 ఉండేదని, దీన్ని అన్ని స్కూళ్లు, కళాశాలల విశ్వవిద్యాలయాల విద్యార్థులకు రూ.40కే రాయితీ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి సమన్వయ సహకారంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న అన్ని మ్యూజియాల్లో ప్యాకేజీ పద్ధతిలో రాయితీలు వర్తింపజేయనున్నట్టు తెలిపారు. ప్యాకేజీ-1 కింద కురుసుర, టీయూ-142, సీ హారియర్ తెలుగు మ్యూజియంలకు రూ.100, ప్యాకేజీ-2 కింద కురుసుర, టీయూ 142, సీ హారియర్ మ్యూజియంలకు రూ.60 ప్యాకేజీ-3 కింద తెలుగు మ్యూజియం టాయ్ ట్రైన్‌లకు రూ.100 చొప్పున వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

రామ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రంగా శుక్రవారం నుంచి 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువ సమ్మేళనం నగరంలో గీతం యూనివర్సిటీ వేదికగా డిసెంబరు 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 200 మంది యువతీ యువకులు పాల్గొంటారని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో గిరిజన సంస్కృతి, వారి అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు పలు అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

కొల్లాం, ఇరోడ్ ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) 5 : ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీకాకుళం-కొల్లాం, సంబల్‌పూర్-ఇరోడ్ మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం-కొల్లాం (08553) ప్రత్యేక రైలుకు ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు, తిరుగు ప్రయాణంలోని కొల్లాం-శ్రీకాకుళం (08554) ప్రత్యేక రైలుకు ఈనెల ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

అలాగే సంబల్‌పూర్-ఇరోడ్ (08311) ప్రత్యేక రైలుకు ఈనెల 11 నుంచి 25 వరకు, తిరుగు ప్రయాణంలోని ఇరోడ్-సంబల్‌పూర్ (08312) ప్రత్యేక రైలుకు ఈనెల 13 నుంచి 27 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్



● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 32, బంగాళ దుంపలు 38, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పైన పచ్చదనం.. పరిసరాలు దుర్గంధం

» 12వ సెక్టర్‌లో గెడ్డ కింద చెత్తాచెదారం » తీవ్ర దుర్వాసనతో స్థానికుల ఇబ్బంది



వంతెనపై ఏర్పాటు చేసిన గ్రిల్‌కు ఏర్పాటు చేసిన పచ్చదనం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ చిత్రం చూశారా.. రోడ్డుకు ఇరువైపులా చక్కని మొక్కలతో అందంగా కనిపిస్తోంది కదూ! జీవీఎంసీ 19వ వార్డులోని ఎంవీపీ కాలనీలో గల 12వ సెక్టర్‌లో ఉన్న గెడ్డను ఇలా మేనేజ్ చేశారు. గాదిరాజు ప్యాలెస్, సచివాలయం మధ్యలో వంతెన కింద నుంచి ఈ గెడ్డ ప్రవహిస్తుంటుంది. అయితే ఈ గెడ్డలో స్థానికులు చెత్తాచెదారాలు వేస్తుండడం, కొన్ని నెలల నుంచి అందులో పూడిక తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు మాత్రం ఇక్కడ 'స్మార్ట్'గా మేనేజ్ చేశామని భావిస్తున్నారు. అందుకే కేవలం గెడ్డ కనిపించకుండా చేసి, పూడిక తీయడం గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెత్త బాగా కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతున్నది. ఈ పక్క నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంతెన కింద చెత్తాచెదారం దట్టంగా పేరుకుపోవడంతో మురుగునీరు చాలా నెమ్మదిగా వెళుతున్నది. మరికొన్ని రోజులైతే మురుగు నీరు ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని అంటున్నారు. దుర్గంధం దెబ్బకు శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి వంతెన కింద పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వంతెన కింద గెడ్డలో పేరుకుపోయిన చెత్త

పోస్టాఫీసులకు మహిళల క్యూ

తపాలా కార్యాలయంలో ఖాతా ఉంటేనే పథకాలు అందుతాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం



పిఠాపురంకాలనీ పోస్టాఫీసు వద్ద క్యూ కట్టిన మహిళలు

మద్దిలపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు పోస్టాఫీస్ ఖాతా ఉండాలని ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలు పోస్టాఫీసుల వద్ద క్యూలు కడుతున్నారు. పోస్టాఫీసులో ఖాతా లేకుండా పథకాలు తమకు రాకుండా పోతాయనే భయంతోఇప్పటికే బ్యాంకు ఖాతాలున్న మహిళలు సైతం పోస్టాఫీసులకు వెళ్తున్నారు.

కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా వచ్చే ఏడాది నుంచి ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయడానికి సన్నహాలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలకు ప్రతి నెలా రూ.1500 బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది. అయితే ఆడబిడ్డ నిధి నగదు పోస్టాఫీస్ ఖాతా ఉంటే మాత్రమే జమ అవుతుందని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో మహిళల్లో ఒకటే టెన్షన్ పట్టుకుంది. పోస్టాఫీసుల్లో ఖాతాలు ఉండాలని వదంతులు వ్యాపించడంతో పనులు మానుకుని మరీ మహిళలు పోస్టాఫీసులకు పరుగులు పెడుతున్నారు.

ఆధార్ లింక్‌తో బ్యాంక్ ఖాతా ఉంటే చాలు

ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు ఆధార్ లింక్ ఉన్న ఏ బ్యాంక్ ఖాతా ఉన్నా సరిపోతుందని అధికారులు సూచిస్తున్నారు. కొంత మంది మహిళలకు ఆధార్ లింక్ ఉన్నా బ్యాంక్ ఖాతాలు లేవు. అలాగే ఆర్థిక లావాదేవీలు చేయనందున మరి కొంతమంది ఖాతాలు సంబంధిత బ్యాంకులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి. అంతేకాకుండా మినిమం బ్యాలెన్స్ లేని ఖాతాల నుంచి బ్యాంక్‌లు పెనాల్టీ కింద కొంత మొత్తం జమ చేసుకుంటున్నాయి.

అయితే లబ్ధిదారులకు ఇలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు పోస్టాఫీసుల్లో ఖాతాల్లో ప్రారంభించాలని సచివాలయ సిబ్బంది సూచిస్తున్నారు. ఇవేవీ ఆలోచించని మహిళలు సంక్షేమ పథకాలకు పోస్టాఫీసు ఖాతాలు మాత్రమే ఉండాలని సమీపంలోని పోస్టాఫీసులకు బారులు తీరుతున్నారు. ముందే పోస్టాఫీసులో ఖాతాలున్న మహిళలు ఎన్‌పీసీఐ (జాతీయ చెల్లింపుల సంస్థ)తో అనుసంధానం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే బ్యాంకుల్లో ఖాతాలు ఉండి, సంక్షేమ పథకాల కింద సాయం పొందిన లబ్ధిదారులు కొత్తగా ఎటువంటి ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

చినగదిలిలో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలోని షిర్డీ సాయిబాబు ఆలయం వద్ద డంపింగ్ యార్డులా ఉన్న చెత్త తరలింపునకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడి సమస్యపై 'చెత్త తరలింపుపై నిర్లక్ష్య' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఏఎంహెచ్‌వో కిశోర్ వెంటనే చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

మహిళపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన నిందితురాలు అరెస్టు

సీతంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వటం లేదనే కోపంతో ఓ మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితురాలిని గురువారం నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి

అక్కయ్యపాలెంలోని శ్రీనివాస్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తున్న రెహిమున్నీషా బేగంకు గోపాలపట్నానికి చెందిన సంగీత (44) కొద్ది కాలం క్రితం డబ్బులు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు ఎంతకూ ఇవ్వకపోవడంతో బుధవారం రెహిమున్నీషా బేగంపై సంగీత పెట్రోల్ పోసి నిప్పు అంటించింది. దీంతో బేగంకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితురాలి సంగీతను అరెస్టు చేశారు.

కృష్ణా కళాశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలు విరాళంగా అందిస్తున్న జగన్నాథం

మద్దిలపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.జగన్నాథం పుస్తకాలు విరాళంగా అందించారు. చారిత్రక గ్రంథాలు, జీవితగాథలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థులు చదువుకోవడానికి ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీనివాసప్రసాద్, డి.శ్రావణకుమార్, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, పోల ఉమామహేశ్వరరావు, అప్పారావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మా ఇళ్లకు శ్లాబ్‌లు వేసుకోనివ్వండి

సీఎం, డిప్యూటీ సీఎంలకు పోస్టుకార్డుల ద్వారా రామకృష్ణాపురం వాసుల వినతి



సీఎం, డిప్యూటీ సీఎంలకు రాసిన కార్డులు చూపుతున్న రామకృష్ణాపురం వాసులు

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని రామకృష్ణాపురంలో సుమారు50 ఏళ్ల నుంచి నివసిస్తున్న వారంతా తమ గృహాలు పక్కా ఇళ్లుగా మార్చుకునే అవకాశం కల్పించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు పోస్టు కార్డులు రాశారు. స్థానిక సంఘం అధ్యక్షుడు బాబూరావు నేతృత్వంలో వీరంతా గురువారం లేఖలు రాసి పోస్టు చేశారు.

బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణలో సుమారు 230 ఇళ్లను తొలగించి ప్రత్యామ్నాయంగా పైనాపిల్ కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. కాలనీ నిర్మించి మౌలికవసతులు కల్పించారు. అయితే వీరిలో కొందరికి ఇళ్ల కేటాయింపులు లేకపోవడంతో రేకుల షెడ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఇళ్లకు శ్లాబ్ వేసుకునే అవకాశం కల్పించాలని వీరంతా కోరుతున్నారు. ఈ ప్రాంతమంతా వాటర్ క్యాచ్‌మెంట్ ప్రాంతమని, శ్లాబ్ వేసుకునే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇక్కడకు సమీపంలోని ఎస్ఎస్ఎన్ నగర్‌లో వారంతా శ్లాబ్‌లు వేసుకున్నారు. ఆ ప్రాంతం ఇదే సర్వే నంబరు 26లో ఉన్నది. అది కూడా క్యాచ్‌మెంట్ ప్రాంతమేనని, అలాగే రైల్వే జోనల్ కార్యాలయానికి ఇదే సర్వే నంబరులో 52 ఎకరాల కేటాయించారని ఈ ప్రాంత వాసులు అంటున్నారు. వారి విషయంలో లేని అభ్యంతరం ప్రభుత్వానికి తమపై ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ గృహాలను శ్లాబ్ వేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

» పాదచారులకు తప్పని ఇబ్బందులు



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలిపివేయడంతో పాదచారులకు ఇబ్బంది ఎదురవుతోంది. అప్పుఘర్ నుంచి కైలాసగిరి రోప్ వే వైపు వెళ్లే ఫుట్‌పాత్‌పై కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఒక్కోసారి నాలుగైదు రోజులు అక్కడి నుంచి వాహనాలను కదపడం లేదు. కైలాసగిరి, తెన్నేటిపార్కు, రుషికొండ వంటి సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో పాటు, ప్రతిరోజూ వివిధ పనులు, భీమిలీ వైపు ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన వారు వెళ్లే వాహనాలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. పాదచారులు ఫుట్‌పాత్ వదిలేసి రోడ్డుపై నడవాల్సి వస్తోంది. అలాగే సమీపంలో పెట్రోలు బంకుకు వెళ్లే వాహనాలు కూడా రహదారికి ఓ పక్కగా వెళ్లి మలుపు తీసుకుంటాయి. దీంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఫుట్‌పాత్‌పై వాహనాలు తొలగిస్తే నడిచే వారికి ఉపయోగకరంగా ఉంటుందని పాదచారులు కోరుతున్నారు.

హనుమంతవాక ట్రాఫిక్ కష్టాలు తీరెదెన్నడో!



» ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పట్టించుకునే నాథుడే కరువు
» వాహనదారులకు తీరని ఇబ్బందులు
» హామీలు తప్ప ఆచరణకు నోచుకోని పరిష్కారం
» కూటమి సర్కారుపై కోటి ఆశలు

ఆరిలోవ. డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య అంతకంతకూ అధికమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి అయిన ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం దశగా ఒక్క అడుగు కూడా పడలేదు. నగరంలో ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో హనుమంతవాక జంక్షన్ ప్రధానమైనది. అటు శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి, మరోవైపు ఆరిలోవ, సింహాచలం వెళ్లే వారు, ఇంకోవైపు కైలాసగిరి వైపు వెళ్లే వాహనదారులు, నగరం నుంచి పై మూడు వైపులకు వెళ్లే వాహనదారులతో హనుమంతవాక జంక్షన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ కూడలి దాటితేనే వాహనదారులు ఊపిరి పీల్చుకుంటారు. ముఖ్యంగా.. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ పద్మవ్యూహంలా ఉంటుంది. వర్షం వస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది.

ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పడితే చాలు రెప్పపాటులో పదుల సంఖ్యలో వాహనాలు వచ్చి ఆగుతాయి. గ్రీన్ సిగ్నల్ పడేసరికి వేలాది వాహనాలు ఒక్కసారిగా దండులా కదులుతాయి. హారన్ల మోత మోగిపోతుంది. దీంతో ఇక్కడ ఎప్పుడూ మహా సందడిగా ఉంటుంది.

ఎన్ని ప్రభుత్వాలు మారినా హనుమంతవాక ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. చిత్రం ఏమిటంటే.. ఏ ప్రభుత్వం ఏర్పడినా కొత్తలో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీర్చివేస్తామనే చెబుతుంటారు. కానీ ఆ తరువాత పట్టించుకోవడమే లేదు. దీనిపై ఎన్నోసార్లు, ఎందరో వినతులు సమర్పించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందో, లేదోనని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

నూతన ఆవిష్కరణపై అవగాహన పెంపొందించుకోవాలి

» ఏయూ వీసీ జి.శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఎన్ఎంఈసీఈ) 2024 జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఈ రంగంలో నిష్ణాతులైన వారిని ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానో మెడిసిన్స్ ప్రభావవంతంగా పని చేస్తున్న విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి పి.శ్యామల మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని అనుసంధానం చేస్తూ మూడు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మూడు రోజుల సదస్సులో భాగంగా ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలు అందించడం జరుగుతుందన్నారు.

పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భద్రక్ స్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు, ఖుర్దా రోడ్డు డివిజన్‌లో మూడో లైను నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

తాత్కాలికంగా రద్దయిన రైళ్లు

ఈ నెల 10, 17న షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్... 11, 19న విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్... 12న విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్... 13న డిఘా-విశాఖ ఎక్స్‌ప్రెస్... 10, 13, 17న తిరుచురాపల్లి-హౌరా ఎక్స్‌ప్రెస్... 12, 15, 19న హౌరా-తిరుచరాపల్లి ఎక్స్‌ప్రెస్... 14న హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్, 15న తిరుపతి-హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్.... 10, 13, 17న సంత్రాగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్... 12, 15, 19న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాచగ్చి ఎక్స్‌ప్రెస్ ... 14న కన్యాకుమారి-హౌరా ఎక్స్‌ప్రెస్, 16న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్... 8, 15న హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్... 11, 18న పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్... 15న సంత్రాగచ్చి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ , ఈనెల 16న తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్... 10, 17న షాలిమార్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్... 11, 18న చెన్నై సెంట్రల్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22826) రద్దు చేశారు.

సీఎం పర్యటన మార్గం పరిశీలన



పోలీసులు, అధికారులకు సూచలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించే మార్గంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర పనులు పూర్తి చేసి రోడ్లు, పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనరు డాక్టర్ పి.సంపత్‌కుమార్ గ్రేటర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ప్రయాణించే విశాఖ ఎయిర్‌పోర్టు, కాకాని నగర్, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, న్యూ కాలనీ, తెలుగుతల్లి ఫ్లైఓవర్, రాంనగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నోవాటెల్, వీఎంఆర్డీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సీఎం గురువారం రాత్రి విచ్చేస్తున్న సందర్భంగా నగరంలో పారిశుధ్య, విద్యుత్తు, గ్రీనరీ తదితర ఏర్పాట్లను జీవీఎంసీ పూర్తి చేసిందని తెలిపారు.

నేడు టీటీడీ కల్యాణ మండపంలో పుష్ప సంకల్పం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో శుక్రవారం వివిధ పుష్పాలతో సంకల్పం నిర్వహించనున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి పుష్పయాగం ఏడో తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ద్వారా కలువ, తామర, చామంతి, గులాబీ, మల్లె తదితర పుష్పాలను ఇక్కడి నుంచి పంపించనున్నారు. వీటిని సేకరించి, ఇక్కడి టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం పుష్ప సంకల్పం నిర్వహించిన అనంతరం తిరుచానూరు పంపిస్తారు. ఆసక్తి గల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని దీపోత్సవ కమిటీ ప్రతినిధులు గ్రంధి రాజేష్, హిమాంశు ప్రసాద్ తెలిపారు.

కనకమహాలక్ష్మికి మార్గశిర మాసం పూజలు

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్గ శిరమాసం ఉత్సవాల్లో భాగంగా మొదటి గురువారం ఆరిలోవ 13వ వార్డులో గల ఎస్‌కెఎల్ఎం నగర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి వేకుల జాము నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, క్షీరాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత అమ్మవారిని దర్శించుకున్నారు.

కేవీలో మృత్తికా దినోత్సవం



మృత్తిక స్వభావాన్ని వివరిస్తున్న విద్యార్థి

అక్కయ్యపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెంలోని కేంద్రీ విద్యాలయం వాల్తేరులో గురువారం జీవశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ కె.యర్రయ్య పర్యవేక్షణలో మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఎస్‌హెచ్‌సీలలో భాగంగా కేంద్ర వ్యవసాయ శాఖ ఎన్నుకొన్న విద్యార్థులు విశాఖపట్నం, వివిధ గ్రామీణ ప్రాంతాల్లో మృత్తిక నమూనాలను సేకరించి వాటిని విశ్లేషించి, మృత్తికా ఆరోగ్య కార్డుల వివరాలను పొందుపరిచారు. వెల్లంకి గ్రామ సచివాలయంలో రైతుల సమక్షంలో గ్రామసభ నిర్వహించిన విద్యార్థులు ఎస్‌హెచ్‌సీలను రైతులకు మృత్తిక ఆరోగ్యం కోసం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జిత్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తకు విష్ణుకుమార్‌రాజు పరామర్శ



రహీమున్నీసా బేగంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

అక్కయ్యపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ దాడిలో గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ రహీమున్నీసా బేగంను గురువారం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, టీడీపీ 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ పరామర్శించారు. ఆమె పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

సీతమ్మధార, డిసెంబరు 5 : (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 49వ వార్డులో బాధితుడు కాంచరపు శివశంకర్‌కు రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సీతమ్మధారలో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ అందచేశారు.

సుబ్రహ్మణ్య షష్ఠి రేపు

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శివరామకృష్ణ ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జీవీ రమాభాయి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సాయంత్రం ఆరు గంటలకు వార్షిక దివ్య కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న రమాదేవి

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం పుణ్యక్షేత్రంలో జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ విన్నవించినట్టు ప్రజా పిత బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకురాలు రమాదేవి తెలిపారు. గురువారం ఆమె డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు, విద్యార్థులకు, యువతకు సనాతన ధర్మంతో పాటు జ్ఞాన విజ్ఞాన అంశాలు తెలియజేయడానికి ఆధ్యాత్మిక కేంద్రం, భక్తుల ప్రథమ చికిత్స కోసం ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఆమెతో పాటు నారాయణ మూర్తి, మణి, సూరిబాబు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- 20వ తేదీ వరకు నిర్వహణ
- భూ సంబంధిత సమస్యలు, వివాదాలు పరిష్కారానికి అవకాశం
- అర్బన్ తహసీల్దార్ రమేశ్



సీతమ్మధార, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు స్థాయిలో భూ సంబంధిత సమస్యలు, వివాదాలు పరిష్కరించేందుకు ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన ఈ సదస్సులకు సంబంధించిన వివరాలకు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రేసపువానిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు తమ భూ సంబంధిత సమస్యలు, వివాదాలపై ఫిర్యాదులు, పరిష్కారానికి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. మద్దిలపాలెం, పరిసర ప్రాంతాలకు చెందిన వారు 9వ తేది (సోమవారం) సీతమ్మధార కూడలిలో గల వుడా షాపింగ్ కాంప్లెక్స్ మేడపై గల 21086109 వార్డు సచివాలయం, పెద్దవాల్తేర్ ప్రాంతానికి చెందిన వారు 11వ తేది (బుధవారం) 21086099 వార్డు సచివాలయం (ఎంవీపీ సర్కిల్ ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ సమీపం), చిన్నవాల్తేరు ప్రాంతానికి చెందిన వారు 13వ తేది (శుక్రవారం) అప్పుఘర్ కల్యాణ మండపం, వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన వారు 16వ తేది (సోమవారం) 21086105 వార్డు సచివాలయం నేతాజీ పార్కులో గల సచివాలయం, దొండపర్తి ప్రాంతానికి చెందిన వారు 18వ తేది (బుధవారం) షాదీఖాన కల్యాణ మండపం, అల్లిపురం ప్రాంతానికి చెందిన వారు 20వ తేది (శుక్రవారం) షాదీఖాన కల్యాణమండపంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ అవకాశాన్ని లు సద్వినియోగం చేసుకొని వారి పరిధిలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలపై సంబంధించిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నైపుణ్యం పెంపొందించుకుంటేనే విజయం

- వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్
- ముగిసిన పాలీటెక్ ఫెస్ట్



విద్యార్థులకు బహుమతిని అందిస్తున్న విశ్వనాథన్

కంచరపాలెం,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతు ఏ రంగంలోనైనా నైపుణ్యం ఉంటేనే రాణించగలమన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు భావ వ్యక్తీకరణ, ప్రాపంచిక జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రవీంద్రబాబు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు శాస్త్రీయ భావాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి దోహద పడాలన్నారు. ఫెస్ట్‌లో ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ బహుమతిని, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారు. కార్యక్రమంలో సాంకేతిక శాఖ రీజనల్ డైరెక్టర్ జె.సత్యనారాయణమూర్తి, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీ రమణతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీఏలో దివ్యాంగ క్రికెటర్లకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు

విశాఖపట్నం, స్పోర్ట్సు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ. పట్టణ ప్రాంతాలలోని ప్రతిభ గల దివ్యాంగ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా కొత్త దివ్యాంగ క్రికెటర్లు ఈనెల 14లోగా తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా ఏసీఏలో నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఏసీఏలో నమోదైన దివ్యాంగ క్రీడాకారుల మధ్య క్రికెట్ కౌన్సిల్ పర్యవేక్షణలో ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కౌన్సిల్ సభ్యుడు కొండా సత్యప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

అక్కయ్యపాలెం/ మురళీనగర్/ సీతంపేట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 46, 50, 25 వార్డుల్లో టీడీపీ స్థానిక నేతలు గురువారం పార్టీ సభ్యత్వాలను సేకరించారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అధ్వర్యంలో నాయకులు ఆ ప్రాంతంలో సభ్యత్వాలు నమోదు చేశారు. అలాగే 46వ వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణ స్వామి, మహిళా నాయకులు మారడపూడి కుమారి, పైలా దేవి, పినపల్లి కనక మహాలక్ష్మి, మారడపూడి ఈశ్వరమ్మ, ఇండిగిబిల్లి కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట కనకమ్మవారి వీధిలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి సభ్యత్వ నమోదుచేశారు.

ఆర్పీఎఫ్ ఆపరేషన్ అమానత్ సేవలు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ అమానత్'లో భాగంగా సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆర్పీఎఫ్ సిబ్బంది ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్లాట్‌ఫామ్‌ల తనిఖీలో భాగంగా భద్రతపై దృష్టి సారిస్తూనే సమస్యలు ఎదుర్కొనే ప్రయాణికులను గుర్తించి అవసరమైన సేవలందించే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కోర్బా ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన వృద్ధ దివ్యాంగ ప్రయాణికుడు సహాయం కోసం ఎదురు చూడడం గమనించిన ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వెంటనే చక్రాల కుర్చీని తీసుకువెళ్లి అతడిని ప్లాట్‌ఫామ్ నుంచి స్టేషన్ బయటకు చేర్చారు. అలాగే సింహాచలం రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.25 వేలు విలువ చేసే వస్తువులతో బ్యాగ్ పోగొట్టుకున్నట్టు ఫిర్యాదు చేయడంతో వెంటనే హెడ్ కానిస్టేబుల్ టీఎస్ రావు తనిఖీలు చేపట్టగా రెండో నంబరు ప్లాట్‌ఫామ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి కింద బ్యాగ్ లభించింది. వెంటనే ఫిర్యాదుదారునికి సమాచారమిచ్చారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

- అధికారులకు సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం

జగదాంబ కూడలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమ్మవారి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. విక్టోరియా వద్ద పార్కింగ్‌ను, క్యూలైన్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఏసీపీ కాళిదాసు, వన్‌టౌన్ సీఐ దేముడుబాబు, ఈవో కె. శోభారాణి, ఇంజనీరు రమణ ఉన్నారు.



రూప కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్ పక్కన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కార్యకర్తల యోగక్షేమాలు ముఖ్యం

- మంత్రి నాదెండ్ల మనోహర్

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తల యోగ క్షేమాలు తమకు ముఖ్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం రాత్రి ఆయన 31వ వార్డు జనసేన మహిళా నాయకులు కొల్లి రూప ఇంటిని సందర్శించారు. వార్డులోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు గురించి మంత్రి ఆరా తీయడం ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు ఎలా ఉన్నారో వారి స్థితిని తెలుసుకోవడం గొప్ప విషయమన్నారు.



కన్యకా పరమేశ్వరి అమ్మవారు, పూజలు చేస్తున్న భక్తులు

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వర్ణ పుష్పార్చన, తామర గింజలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, సామూహిక లలితా సహస్రపారాయణం జరిపారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేవారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు బంగారు సంపెంగలతో పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి చదరంగం పోటీలు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఎండాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు సౌత్ జోన్ స్థాయిలో మహిళల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు. విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన జిమ్‌సర్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 65 వర్సిటీల నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్టు తెలిపారు. అలాగే వంద మంది మేనేజర్లు, పది మంది అధికారులు పాల్గొంటారన్నారు. గీతం వైద్య కళాశాలలోని ఎల్లా ప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గీతం క్రీడా విభాగం మేనేజర్ రితేశ్ సిన్హా, తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కిల్ హబ్ ఆధ్వర్యంలో పదో తరగతి పాసైన వారికి ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు.మూడు నెలల శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ప్రభుత్వ పాత ఐటీఐ కార్యాలయంలో సంప్రతించాలని, వివరాలకు 7702506614 నంబరుకు కాల్ చేయాలన్నారు.

నగరానికి చేరుకున్న సీఎం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 6.45 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

ఇన్‌చార్జి మంత్రిని అడ్డుకున్న పోలీసులు

సీఎం చంద్రబాబు సీరియస్

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసేందు కు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులను కూడా లోపలకు అనుమతించలేదు. ఆ సమయంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది కూడా అతిగా ప్రవర్తించడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడిరామకృష్ణబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం సీఎంకు వెలగపూడి ఫిర్యాదు చేశారు. పార్టీనాయకులను లోపలకు రాకుండా ఎలా ఆపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని మందలించారు. తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులను అనుమతించాలని చంద్రబాబు ఆదేశించారు.

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ప్రశ్నలు మాత్రం ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సుకు సంబంధించినవి ఇచ్చారు. విద్యార్థులు విషయాన్ని ఇన్విజిలేటర్‌కు తెలియజేశారు. అయితే, ఆయా కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు పరీక్ష హాల్ నుంచి వెళ్లడానికి లేదని, అబ్జర్వర్‌కు విషయాన్ని తెలియజేశామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతామని, పరీక్షకు హాజరైనట్టు హాల్ టికెట్ నంబర్లు వేసి ఇవ్వాలని అబ్జర్వర్లు సూచించారు. కాలేజీ యాజమాన్యాల ద్వారా ఈ విషయాన్ని ఏయూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు పలువురు గురువారం ఉదయం వర్సిటీకి వెళ్లి ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేసినప్పటికీ అవకాశం ఇవ్వలేదని తెలిసింది.

అదే తప్పు..

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గురువారం కూడా అదే తప్పిదం జరిగింది. గురువారం ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సు చదివే విద్యార్థులకు ఫంక్షనల్ ఫుడ్ అండ్ న్యూట్రిస్యూటికల్స్ పరీక్ష నిర్వహించాలి. అయితే, జరిగిన ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులోని కెమిస్ట్రీ అండ్ ఫ్యాట్స్ అండ్ ఆయిల్స్ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలను ఇచ్చారు. కోర్సు పేరు, పేపర్ వివరాలను ఒకలా, అందులో ఇచ్చిన ప్రశ్నలు మరోలా ఉండడంతో విద్యార్థులు కనీసం పెన్ను కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఏయూ వీసీ ప్రొఫెసర్ జి శశిభూషణరావును వివరణ కోరగా తప్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూస్తామని, అవసరమైతే పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు. దీనిపై అధికారులతో మాట్లాడతామని వివరించారు.

నేడు నీతి ఆయోగ్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సమాచారం ప్రకారం ఏ విధమైన చర్యలు చేపట్టాలనే దానిపై నీతి ఆయోగ్ ఒక నివేదిక రూపొందించింది. దానిని బృందం జిల్లా అధికారులకు వివరించి, వివిధ శాఖలు ఏ విధంగా ముందుకువెళ్లాలో మార్గదర్శనం చేస్తుంది. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ బృందంతో పాటు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు పాల్గొంటారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదు చేస్తామన్నారు. సదస్సుల్లో వచ్చిన వినతులు 45 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ రేపు

జిల్లాలోని 595 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల ఏడో తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రాలను సంబంధిత హెచ్ఎం ద్వారా తల్లిదండ్రులకు పంపామన్నారు. మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రుల సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల చదువు, క్రమశిక్షణ గురించి తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు. అందువల్ల తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. విలేకరుల సమావేశంలో డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమానికి స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గతంలో పలుమార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించినప్పటికీ అనివార్య కారణాల వల్ల పూర్తిస్థాయిలో సాధ్యపడలేదన్నారు. కానీ ఇప్పుడు మాత్రం శతశాతం నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల ఉత్పత్తిని పెంచేందుకు వ్యాపారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల మార్కెట్‌కు కూడా అవకాశాలు కల్పిస్తామన్నారు. గతంలో వీటి ధరలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కంటే చాలా ఎక్కువ ఉండడంతో కొనుగోలుదారులు వాటి జోలికి వెళ్లేవారు కాదన్నారు. కానీ ఇప్పుడు వాటి ఉత్పత్తి భారీగా పెరగడంతో ధరలు కూడా గణనీయంగా తగ్గి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దాదాపు సమానంగా ఉంటాయన్నారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అందరూ విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ట్రాయ్ పేరుతో కాల్స్

... 5వ పేజీ తరువాయి

యుగం నడుస్తుండడంతో చాలామంది ఫోన్‌లోనే గడుపుతున్నారు. దీంతో ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని, పరిమితికి మించి కాల్స్ మాట్లాడుతున్నారని సైబర్ మోసగాళ్లు చెప్పేసరికి, బాధితులు నిజమేనని భావిస్తున్నారు. ఈ క్రమంలో అవతలివారు చెప్పినట్టు చేసి తమ ఫోన్ నంబర్ బ్లాక్ కాకుండా రెన్యువల్ చేసుకోవాలనుకుంటున్నారు. తీరా ఖాతాలు ఖాళీ అయిపోతుండడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ట్రాయ్, బ్యాంకుల పేరుతోగానీ, సీబీఐ, కస్టమ్స్ అధికారులమంటూ గానీ కొరియర్ వచ్చిందని గానీ ఎవరైనా ఫోన్ చేసినా, కేసు లేకుండా చేసేందుకంటూ డబ్బులు కావాలని అడిగినా ఎవరూ నమ్మకూడదని సైబర్ క్రైమ్ సీఐ బీఎండీ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు ఏదోవిధంగా మోసం చేసేందుకు యత్నిస్తుంటారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి బ్యాంకు ఖాతా వివరాలను బయటకు వెల్లడించవద్దని కోరారు.

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

... 5వ పేజీ తరువాయి

కొద్దినెలల క్రితం జరిగింది. వారి చేతిలో సుమారు 40 మంది వరకు మోసపోయారు. సుమారు రూ.70 లక్షల వరకు వసూలు చేసుకొని ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది.

ఉద్యోగం ఇచ్చాక వేధింపులు

నగరంలో ఉన్న ఓ ఐటీ కంపెనీ ఈ ఏడాది మార్చి నెలలో బీటెక్ పాసైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించింది. సుమారు 30 మందిని తీసుకుంది. వారికి అన్నీ కలిపి ఏడాదికి రూ.1.8 లక్షల జీతం ఇస్తామని ఆఫర్ లెటర్ ఇచ్చింది. అంటే నెలకు సుమారు రూ.15 వేల జీతం. ఎటువంటి అనుభవం లేనందున, శిక్షణ ఇవ్వాలి కాబట్టి, అది పూర్తయ్యాక వెళ్లిపోకుండా ఉండడానికి డిపాజిట్ కట్టాలని ఒత్తిడి పెట్టింది. కొందరి వద్ద రూ.3 లక్షలు, మరికొందరి వద్ద రూ.6 లక్షలు చొప్పున వారి తల్లితండ్రుల నుంచి అడ్వాన్స్ చెక్కులు తీసుకుంది. మూడు నెలల ప్రొబేషన్ తరువాత రెగ్యులర్ చేస్తామని, అప్పుడు జీతం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. యువతీ యువకులు ఉత్సాహంగా చేరారు. అయితే వారిలో 80 శాతం మందికి ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ఏ బాధ్యత అప్పగించలేదు. నెల నెలా జీతం మాత్రం ఇచ్చింది. ఏదైనా పని చెప్పాలని కొందరు కోరితే..'మీకు ఏమి చేతనవుతుంది? ఏమీ చేయలేరు.' అంటూ కంపెనీ ప్రతినిధులు ఎగతాళి చేయడం ప్రారంభించారు. తాము చేరి మూడు నెలలు దాటింది కాబట్టి జీతం పెంచాలని నలుగురైదుగురు కోరగా, 'ఇదే మీకు ఎక్కువ' అంటూ వెటకారం చేశారు. దాంతో తాము ఉద్యోగం మానేస్తామని, సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే వారిని మరింత వేధించడం ప్రారంభించారు. మూడు నెలల ముందు నోటీసు ఇవ్వడంతో పాటు రూ.3 లక్షలు కట్టాలని, అప్పుడే సర్టిఫికెట్లు, అడ్వాన్స్ చెక్కులు వెనక్కి ఇస్తామని నిబంధన పెట్టారు. ఇచ్చిన జీతం లక్ష రూపాయలు కూడా లేదని, మూడు లక్షలు ఎందుకు ఇస్తామని అడిగితే, నచ్చింది చేసుకోండి..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని ఓ ఎమ్మెల్యేను కలిసి జరిగిందంతా వివరించారు. ఆ కంపెనీ తన నియోజకవర్గంలోనే ఉండడంతో ఆ పోలీస్ స్టేషన్ అధికారికి ఫోన్ చేసి, పిల్లలకు న్యాయం చేయాలని సూచించారు. అక్కడ ఈ పంచాయితీ మూడు రోజులు నడిచింది. పిల్లలను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించుకొని కింది స్థాయి అధికారి యాజమాన్యానికి వత్తాసు పలికారు. ఈ విషయం మళ్లీ ఎమ్మెల్యేకు చెప్పడంతో, ఆయన స్టేషన్ అధికారికి మరోసారి ఫోన్ చేశారు. ఒక్కొక్కరు రూ.1.5 లక్షలు చొప్పున చెల్లిస్తే తప్ప సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కంపెనీ ప్రతినిధులు ఒప్పుకోకపోవడంతో ఆ ఒప్పందం ప్రకారం కేసు సెటిల్‌మెంట్ చేశారు.డబ్బులు కట్టాకేవారి సర్టిఫికెట్లు వెనక్కిఇచ్చారు.

☛ సంక్షిప్తంగా..

మ్యూజియంల సందర్శనకు ప్రవేశ రుసుము తగ్గింపు

సిరిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మ్యూజియం ప్రవేశానికి స్కూలు విద్యార్థులకు ప్రవేశ రుసుములో రాయితీ కల్పిస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలు నేటి, భావి తరాలకు చాటి చెప్పేలా 40 నిమిషాల నిడివితో లైట్ అండ్ మ్యూజిక్ ప్రదర్శనకు ప్రవేశ రుసుం గతంలో రూ.60 ఉండేదని, దీన్ని అన్ని స్కూళ్లు, కళాశాలల విశ్వవిద్యాలయాల విద్యార్థులకు రూ.40కే రాయితీ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి సమన్వయ సహకారంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న అన్ని మ్యూజియాల్లో ప్యాకేజీ పద్ధతిలో రాయితీలు వర్తింపజేయనున్నట్టు తెలిపారు. ప్యాకేజీ-1 కింద కురుసుర, టీయూ-142, సీ హారియర్ తెలుగు మ్యూజియంలకు రూ.100, ప్యాకేజీ-2 కింద కురుసుర, టీయూ 142, సీ హారియర్ మ్యూజియంలకు రూ.60 ప్యాకేజీ-3 కింద తెలుగు మ్యూజియం టాయ్ ట్రైన్‌లకు రూ.100 చొప్పున వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

రామ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రంగా శుక్రవారం నుంచి 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువ సమ్మేళనం నగరంలో గీతం యూనివర్శిటీ వేదికగా డిసెంబరు 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 200 మంది యువతీ యువకులు పాల్గొంటారని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో గిరిజన సంస్కృతి, వారి అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు పలు అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

కొల్లాం, ఇరోడ్ ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) 5 : ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీకాకుళం-కొల్లాం, సంబల్‌పూర్-ఇరోడ్ మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం-కొల్లాం (08553) ప్రత్యేక రైలుకు ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు, తిరుగు ప్రయాణంలోని కొల్లాం-శ్రీకాకుళం (08554) ప్రత్యేక రైలుకు ఈనెల ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

అలాగే సంబల్‌పూర్-ఇరోడ్ (08311) ప్రత్యేక రైలుకు ఈనెల 11 నుంచి 25 వరకు, తిరుగు ప్రయాణంలోని ఇరోడ్-సంబల్‌పూర్ (08312) ప్రత్యేక రైలుకు ఈనెల 13 నుంచి 27 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్



● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 32, బంగాళ దుంపలు 38, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పైన పచ్చదనం.. పరిసరాలు దుర్గంధం

»12వ సెక్టర్‌లో గెడ్డ కింద చెత్తాచెదారం » తీవ్ర దుర్వాసనతో స్థానికుల ఇబ్బంది



వంతెనపై ఏర్పాటు చేసిన గ్రిల్‌కు ఏర్పాటు చేసిన పచ్చదనం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ చిత్రం చూశారా.. రోడ్డుకు ఇరువైపులా చక్కని మొక్కలతో అందంగా కనిపిస్తోంది కదూ! జీవీఎంసీ 19వ వార్డులోని ఎంవీపీ కాలనీలో గల 12వ సెక్టర్‌లో ఉన్న గెడ్డను ఇలా మేనేజ్ చేశారు. గాదిరాజు ప్యాలెస్, సచివాలయం మధ్యలో వంతెన కింద నుంచి ఈ గెడ్డ ప్రవహిస్తుంటుంది. అయితే ఈ గెడ్డలో స్థానికులు చెత్తాచెదారాలు వేస్తుండడం, కొన్ని నెలల నుంచి అందులో పూడిక తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు మాత్రం ఇక్కడ 'స్మార్ట్'గా మేనేజ్ చేశామని భావిస్తున్నారు. అందుకే కేవలం గెడ్డ కనిపించకుండా చేసి, పూడిక తీయడం గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెత్త బాగా కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతున్నది. ఈ పక్క నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంతెన కింద చెత్తాచెదారం దట్టంగా పేరుకుపోవడంతో మురుగునీరు చాలా నెమ్మదిగా వెళుతున్నది. మరికొన్ని రోజులైతే మురుగు నీరు ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని అంటున్నారు. దుర్గంధం దెబ్బకు శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి వంతెన కింద పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వంతెన కింద గెడ్డలో పేరుకుపోయిన చెత్త

పోస్టాఫీసులకు మహిళల క్యూ

తపాలా కార్యాలయంలో ఖాతా ఉంటేనే పథకాలు అందుతాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం



పిఠాపురంకాలనీ పోస్టాఫీసు వద్ద క్యూ కట్టిన మహిళలు

మద్దిలపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు పోస్టాఫీస్ ఖాతా ఉండాలని ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలు పోస్టాఫీసుల వద్ద క్యూలు కడుతున్నారు. పోస్టాఫీసులో ఖాతా లేకుండా పథకాలు తమకు రాకుండా పోతాయనే భయంతోఇప్పటికే బ్యాంకు ఖాతాలున్న మహిళలు సైతం పోస్టాఫీసులకు వెళ్తున్నారు.

కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా వచ్చే ఏడాది నుంచి ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయడానికి సన్నహాలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలకు ప్రతి నెలా రూ.1500 బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది. అయితే ఆడబిడ్డ నిధి నగదు పోస్టాఫీస్ ఖాతా ఉంటే మాత్రమే జమ అవుతుందని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో మహిళల్లో ఒకటే టెన్షన్ పట్టుకుంది. పోస్టాఫీసుల్లో ఖాతాలు ఉండాలని వదంతులు వ్యాపించడంతో పనులు మానుకుని మరీ మహిళలు పోస్టాఫీసులకు పరుగులు పెడుతున్నారు.

ఆధార్ లింక్‌తో బ్యాంక్ ఖాతా ఉంటే చాలు

ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు ఆధార్ లింక్ ఉన్న ఏ బ్యాంక్ ఖాతా ఉన్నా సరిపోతుందని అధికారులు సూచిస్తున్నారు. కొంత మంది మహిళలకు ఆధార్ లింక్ ఉన్నా బ్యాంక్ ఖాతాలు లేవు. అలాగే ఆర్థిక లావాదేవీలు చేయనందున మరి కొంతమంది ఖాతాలు సంబంధిత బ్యాంకులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి. అంతేకాకుండా మినిమం బ్యాలెన్స్ లేని ఖాతాల నుంచి బ్యాంక్‌లు పెనాల్టీ కింద కొంత మొత్తం జమ చేసుకుంటున్నాయి.

అయితే లబ్ధిదారులకు ఇలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు పోస్టాఫీసుల్లో ఖాతాల్లో ప్రారంభించాలని సచివాలయ సిబ్బంది సూచిస్తున్నారు. ఇవేవీ ఆలోచించని మహిళలు సంక్షేమ పథకాలకు పోస్టాఫీసు ఖాతాలు మాత్రమే ఉండాలని సమీపంలోని పోస్టాఫీసులకు బారులు తీరుతున్నారు. ముందే పోస్టాఫీసులో ఖాతాలున్న మహిళలు ఎన్‌పీసీఐ (జాతీయ చెల్లింపుల సంస్థ)తో అనుసంధానం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే బ్యాంకుల్లో ఖాతాలు ఉండి, సంక్షేమ పథకాల కింద సాయం పొందిన లబ్ధిదారులు కొత్తగా ఎటువంటి ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

చినగదిలిలో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలోని షిర్డీ సాయిబాబు ఆలయం వద్ద డంపింగ్ యార్డులా ఉన్న చెత్త తరలింపునకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడి సమస్యపై 'చెత్త తరలింపుపై నిర్లక్ష్య' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఏఎంహెచ్‌వో కిశోర్ వెంటనే చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

మహిళపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన నిందితురాలు అరెస్టు

సీతంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వటం లేదనే కోపంతో ఓ మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితురాలిని గురువారం నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి

అక్కయ్యపాలెంలోని శ్రీనివాస్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తున్న రెహీమున్నీషా బేగంకు గోపాలపట్నానికి చెందిన సంగీత (44) కొద్ది కాలం క్రితం డబ్బులు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు ఎంతకూ ఇవ్వకపోవడంతో బుధవారం రెహీమున్నీషా బేగంపై సంగీత పెట్రోల్ పోసి నిప్పు అంటించింది. దీంతో బేగంకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితురాలి సంగీతను అరెస్టు చేశారు.

కృష్ణా కళాశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

మద్దిలపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.జగన్నాథం పుస్తకాలు విరాళంగా అందించారు. చారిత్రక గ్రంథాలు, జీవితగాథలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థులు చదువుకోవడానికి ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీనివాసప్రసాద్, డి.శ్రావణకుమార్, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, పోల ఉమామహేశ్వరరావు, అప్పారావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలు విరాళంగా అందిస్తున్న జగన్నాథం

ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

» పాదచారులకు తప్పని ఇబ్బందులు



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలిపివేయడంతో పాదచారులకు ఇబ్బంది ఎదురవుతోంది. అప్పుఘర్ నుంచి కైలాసగిరి రోప్ వే వైపు వెళ్లే ఫుట్‌పాత్‌పై కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఒక్కోసారి నాలుగైదు రోజులు అక్కడి నుంచి వాహనాలను కదపడం లేదు. కైలాసగిరి, తెన్నేటిపార్కు, రుషికొండ వంటి సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో పాటు, ప్రతిరోజూ వివిధ పనులు, భీమిలీ వైపు ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన వారు వెళ్లే వాహనాలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. పాదచారులు ఫుట్‌పాత్ వదిలేసి రోడ్డుపై నడవాల్సి వస్తోంది. అలాగే సమీపంలో పెట్రోలు బంకుకు వెళ్లే వాహనాలు కూడా రహదారికి ఓ పక్కగా వెళ్లి మలుపు తీసుకుంటాయి. దీంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఫుట్‌పాత్‌పై వాహనాలు తొలగిస్తే నడిచే వారికి ఉపయోగకరంగా ఉంటుందని పాదచారులు కోరుతున్నారు.

మా ఇళ్లకు శ్లాబ్‌లు వేసుకోనివ్వండి

సీఎం, డిప్యూటీ సీఎంలకు పోస్టుకార్డుల ద్వారా రామకృష్ణాపురం వాసుల వినతి



సీఎం, డిప్యూటీ సీఎంలకు రాసిన కార్డులు చూపుతున్న రామకృష్ణాపురం వాసులు

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని రామకృష్ణాపురంలో సుమారు50 ఏళ్ల నుంచి నివసిస్తున్న వారంతా తమ గృహాలు పక్కా ఇళ్లుగా మార్చుకునే అవకాశం కల్పించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు పోస్టు కార్డులు రాశారు. స్థానిక సంఘం అధ్యక్షుడు బాబూరావు నేతృత్వంలో వీరంతా గురువారం లేఖలు రాసి పోస్టు చేశారు.

బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణలో సుమారు 230 ఇళ్లను తొలగించి ప్రత్యామ్నాయంగా పైనాపిల్ కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. కాలనీ నిర్మించి మౌలికవసతులు కల్పించారు. అయితే వీరిలో కొందరికి ఇళ్ల కేటాయింపులు లేకపోవడంతో రేకుల షెడ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఇళ్లకు శ్లాబ్ వేసుకునే అవకాశం కల్పించాలని వీరంతా కోరుతున్నారు. ఈ ప్రాంతమంతా వాటర్ క్యాచ్‌మెంట్ ప్రాంతమని, శ్లాబ్ వేసుకునే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇక్కడకు సమీపంలోని ఎస్‌ఎస్‌ఎన్ నగర్‌లో వారంతా శ్లాబ్‌లు వేసుకున్నారు. ఆ ప్రాంతం ఇదే సర్వే నంబరు 26లో ఉన్నది. అది కూడా క్యాచ్‌మెంట్ ప్రాంతమేనని, అలాగే రైల్వే జోనల్ కార్యాలయానికి ఇదే సర్వే నంబరులో 52 ఎకరాల కేటాయించారని ఈ ప్రాంత వాసులు అంటున్నారు. వారి విషయంలో లేని అభ్యంతరం ప్రభుత్వానికి తమపై ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ గృహాలను శ్లాబ్ వేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

హనుమంతవాక ట్రాఫిక్ కష్టాలు తీరెదెన్నడో!



» ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పట్టించుకునే నాథుడే కరువు
» వాహనదారులకు తీరని ఇబ్బందులు
» హామీలు తప్ప ఆచరణకు నోచుకోని పరిష్కారం
» కూటమి సర్కారుపై కోటి ఆశలు

ఆరిలోవ. డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య అంతకంతకూ అధికమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి అయిన ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం దశగా ఒక్క అడుగు కూడా పడలేదు. నగరంలో ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో హనుమంతవాక జంక్షన్ ప్రధానమైనది. అటు శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి, మరోవైపు ఆరిలోవ, సింహాచలం వెళ్లే వారు, ఇంకోవైపు కైలాసగిరి వైపు వెళ్లే వాహనదారులు, నగరం నుంచి పై మూడు వైపులకు వెళ్లే వాహనదారులతో హనుమంతవాక జంక్షన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ కూడలి దాటితేనే వాహనదారులు ఊపిరి పీల్చుకుంటారు. ముఖ్యంగా.. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ పద్మవ్యూహంలా ఉంటుంది. వర్షం వస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది.

ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పడితే చాలు రెప్పపాటులో పదుల సంఖ్యలో వాహనాలు వచ్చి ఆగుతాయి. గ్రీన్ సిగ్నల్ పడేసరికి వేలాది వాహనాలు ఒక్కసారిగా దండులా కదులుతాయి. హారన్ల మోత మోగిపోతుంది. దీంతో ఇక్కడ ఎప్పుడూ మహా సందడిగా ఉంటుంది.

ఎన్ని ప్రభుత్వాలు మారినా హనుమంతవాక ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. చిత్రం ఏమిటంటే.. ఏ ప్రభుత్వం ఏర్పడినా కొత్తలో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీర్చివేస్తామనే చెబుతుంటారు. కానీ ఆ తరువాత పట్టించుకోవడమే లేదు. దీనిపై ఎన్నోసార్లు, ఎందరో వినతులు సమర్పించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందో, లేదోనని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

నూతన ఆవిష్కరణపై అవగాహన పెంపొందించుకోవాలి

» ఏయూ వీసీ జి.శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఎన్ఎంఈసీఈ) 2024 జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఈ రంగంలో నిష్ణాతులైన వారిని ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానో మెడిసిన్స్ ప్రభావవంతంగా పని చేస్తున్న విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి పి.శ్యామల మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని అనుసంధానం చేస్తూ మూడు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మూడు రోజుల సదస్సులో భాగంగా ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలు అందించడం జరుగుతుందన్నారు.

పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భద్రక్ స్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు, ఖుర్దా రోడ్డు డివిజన్‌లో మూడో లైను నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికగా రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

తాత్కాలికంగా రద్దయిన రైళ్లు

ఈ నెల 10, 17న షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్... 11, 19న విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్... 12న విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్... 13న డిఘా-విశాఖ ఎక్స్‌ప్రెస్... 10, 13, 17న తిరుచురాపల్లి-హౌరా ఎక్స్‌ప్రెస్... 12, 15, 19న హౌరా-తిరుచరాపల్లి ఎక్స్‌ప్రెస్... 14న హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్, 15న తిరుపతి-హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్.... 10, 13, 17న సంత్రాగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్... 12, 15, 19న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాచగ్చి ఎక్స్‌ప్రెస్ ... 14న కన్యాకుమారి-హౌరా ఎక్స్‌ప్రెస్, 16న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్... 8, 15న హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్... 11, 18న పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్... 15న సంత్రాగచ్చి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ , ఈనెల 16న తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్.... 10, 17న షాలిమార్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్... 11, 18న చెన్నై సెంట్రల్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22826) రద్దు చేశారు.

సీఎం పర్యటన మార్గం పరిశీలన



పోలీసులు, అధికారులకు సూచలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించే మార్గంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర పనులు పూర్తి చేసి రోడ్లు, పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనరు డాక్టర్ పి.సంపత్‌కుమార్ గ్రేటర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ప్రయాణించే విశాఖ ఎయిర్‌పోర్టు, కాకాని నగర్, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, న్యూ కాలనీ, తెలుగుతల్లి ఫ్లైవర్, రాంనగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నోవాటెల్, వీఎంఆర్డీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సీఎం గురువారం రాత్రి విచ్చేస్తున్న సందర్భంగా నగరంలో పారిశుధ్య, విద్యుత్తు, గ్రీనరీ తదితర ఏర్పాట్లను జీవీఎంసీ పూర్తి చేసిందని తెలిపారు.

నేడు టీటీడి కల్యాణ మండపంలో పుష్ప సంకల్పం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో శుక్రవారం వివిధ పుష్పాలతో సంకల్పం నిర్వహించనున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి పుష్పయాగం ఏడో తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ద్వారా కలువ, తామరా, చామంతి, గులాబీ, మల్లె తదితర పుష్పాలను ఇక్కడి నుంచి పంపించనున్నారు. వీటిని సేకరించి, ఇక్కడి టీటీడి కల్యాణమండపంలో శుక్రవారం పుష్ప సంకల్పం నిర్వహించిన అనంతరం తిరుచానూరు పంపిస్తారు. ఆసక్తి గల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని దీపోత్సవ కమిటీ ప్రతినిధులు గ్రంధి రాజేష్, హిమాంశు ప్రసాద్ తెలిపారు.

కనకమహాలక్ష్మికి మార్గశిర మాసం పూజలు

ఆరిలోవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్గ శిరమాసం ఉత్సవాల్లో భాగంగా మొదటి గురువారం ఆరిలోవ 13వ వార్డులో గల ఎస్‌కెఎల్‌ఎం నగర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి వేకుల జాము నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, క్షీరాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత అమ్మవారిని దర్శించుకున్నారు.

కేవీలో మృత్తికా దినోత్సవం



మృత్తిక స్వభావాన్ని వివరిస్తున్న విద్యార్థి

అక్కయ్యపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెంలోని కేంద్రీ విద్యాలయం వాల్తేరులో గురువారం జీవశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ కె.యర్రయ్య పర్యవేక్షణలో మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఎస్‌హెచ్‌సీలలో భాగంగా కేంద్ర వ్యవసాయ శాఖ ఎన్నుకొన్న విద్యార్థులు విశాఖపట్నం, వివిధ గ్రామీణ ప్రాంతాల్లో మృత్తిక నమూనాలను సేకరించి వాటిని విశ్లేషించి, మృత్తికా ఆరోగ్య కార్డుల వివరాలను పొందుపరిచారు. వెల్లంకి గ్రామ సచివాలయంలో రైతుల సమక్షంలో గ్రామసభ నిర్వహించిన విద్యార్థులు ఎస్‌హెచ్‌సీలను రైతులకు మృత్తిక ఆరోగ్యం కోసం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జిత్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తకు విష్ణుకుమార్‌రాజు పరామర్శ



రహీమున్నీసా బేగంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

అక్కయ్యపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ దాడిలో గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ రహీమున్నీసా బేగంను గురువారం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, టీడీపీ 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ పరామర్శించారు. ఆమె పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

సీతమ్మధార, డిసెంబరు 5 : (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 49వ వార్డులో బాధితుడు కాంచరపు శివశంకర్‌కు రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సీతమ్మధారలో గల బిజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ అందచేశారు.

సుబ్రహ్మణ్య షష్ఠి రేపు

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శివరామకృష్ణ ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సాయంత్రం ఆరు గంటలకు వార్షిక దివ్య కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న రమాదేవి

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం పుణ్యక్షేత్రంలో జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ విన్నవించినట్టు ప్రజా పిత బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకురాలు రమాదేవి తెలిపారు. గురువారం ఆమె డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు, విద్యార్థులకు, యువతకు సనాతన ధర్మంతో పాటు జ్ఞాన విజ్ఞాన అంశాలు తెలియజేయడానికి ఆధ్యాత్మిక కేంద్రం, భక్తుల ప్రథమ చికిత్స కోసం ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఆమెతో పాటు నారాయణ మూర్తి, మణి, సూరిబాబు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- 20వ తేదీ వరకు నిర్వహణ
- భూ సంబంధిత సమస్యలు, వివాదాలు పరిష్కారానికి అవకాశం
- అర్బన్ తహసీల్దార్ రమేశ్



సీతమ్మధార, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు స్థాయిలో భూ సంబంధిత సమస్యలు, వివాదాలు పరిష్కరించేందుకు ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన ఈ సదస్సులకు సంబంధించిన వివరాలకు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సులో భాగంగా రేసపువానిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు తమ భూ సంబంధిత సమస్యలు, వివాదాలపై ఫిర్యాదులు, పరిష్కారానికి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. మద్దిలపాలెం, పరిసర ప్రాంతాలకు చెందిన వారు 9వ తేది (సోమవారం) సీతమ్మధార కూడలిలో గల వుడా షాపింగ్ కాంప్లెక్స్ మేడపై గల 21086109 వార్డు సచివాలయం, పెద్దవాల్తేర్ ప్రాంతానికి చెందిన వారు 11వ తేది (బుధవారం) 21086099 వార్డు సచివాలయం (ఎంవీపీ సర్కిల్ ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ సమీపం), చిన్నవాల్తేరు ప్రాంతానికి చెందిన వారు 13వ తేది (శుక్రవారం) అప్పుఘర్ కల్యాణ మండపం, వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన వారు 16వ తేది (సోమవారం) 21086105 వార్డు సచివాలయం నేతాజీ పార్కులో గల సచివాలయం, దొండపర్తి ప్రాంతానికి చెందిన వారు 18వ తేది (బుధవారం) షాదీఖాన కల్యాణ మండపం, అల్లిపురం ప్రాంతానికి చెందిన వారు 20వ తేది (శుక్రవారం) షాదీఖాన కల్యాణమండపంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ అవకాశాన్ని లు సద్వినియోగం చేసుకొని వారి పరిధిలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలపై సంబంధించిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నైపుణ్యం పెంపొందించుకుంటేనే విజయం

- వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్
- ముగిసిన పాలీటెక్ ఫెస్ట్



విద్యార్థులకు బహుమతిని అందిస్తున్న విశ్వనాథన్

కంచరపాలెం,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతు ఏ రంగంలోనైనా నైపుణ్యం ఉంటేనే రాణించగలమన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు భావ వ్యక్తీకరణ, ప్రాపంచిక జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రవీంద్రబాబు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు శాస్త్రీయ భావాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి దోహద పడాలన్నారు. ఫెస్ట్‌లో అళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ బహుమతిని, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారు. కార్యక్రమంలో సాంకేతిక శాఖ రీజనల్ డైరెక్టర్ జె.సత్యనారాయణమూర్తి, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీ రమణతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

అక్కయ్యపాలెం/ మురళీనగర్/ సీతంపేట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 46, 50, 25 వార్డుల్లో టీడీపీ స్థానిక నేతలు గురువారం పార్టీ సభ్యత్వాలను సేకరించారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అధ్వర్యంలో నాయకులు ఆ ప్రాంతంలో సభ్యత్వాలు నమోదు చేశారు. అలాగే 46వ వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణ స్వామి, మహిళా నాయకులు మారడపూడి కుమారి, పైలా దేవి, పినపల్లి కనక మహాలక్ష్మి, మారడపూడి ఈశ్వరమ్మ, ఇండిగిబిల్లి కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట కనకమ్మవారి వీధిలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి సభ్యత్వ నమోదుచేశారు.

ఆర్పీఎఫ్ ఆపరేషన్ అమానత్ సేవలు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ అమానత్'లో భాగంగా సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆర్పీఎఫ్ సిబ్బంది ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్లాట్‌ఫామ్‌ల తనిఖీలో భాగంగా భద్రతపై దృష్టి సారిస్తూనే సమస్యలు ఎదుర్కొనే ప్రయాణికులను గుర్తించి అవసరమైన సేవలందించే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కోర్బా ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన వృద్ధ దివ్యాంగ ప్రయాణికుడు సహాయం కోసం ఎదురు చూడడం గమనించిన ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వెంటనే చక్రాల కుర్చీని తీసుకువెళ్లి అతడిని ప్లాట్‌ఫామ్ నుంచి స్టేషన్ బయటకు చేర్చారు. అలాగే సింహాచలం రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.25 వేలు విలువ చేసే వస్తువులతో బ్యాగ్ పోగొట్టుకున్నట్టు ఫిర్యాదు చేయడంతో వెంటనే హెడ్ కానిస్టేబుల్ టీఎస్ రావు తనిఖీలు చేపట్టగా రెండో నంబరు ప్లాట్‌ఫామ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి కింద బ్యాగ్ లభించింది. వెంటనే ఫిర్యాదుదారునికి సమాచారమిచ్చారు.

ఏసీఏలో దివ్యాంగ క్రికెటర్లకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రతిభ గల దివ్యాంగ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా కొత్త దివ్యాంగ క్రికెటర్లు ఈనెల 14లోగా తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా ఏసీఏలో నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఏసీఏలో నమోదైన దివ్యాంగ క్రీడాకారుల మధ్య క్రికెట్ కౌన్సిల్ పర్యవేక్షణలో ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కౌన్సిల్ సభ్యుడు కొండా సత్యప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

- అధికారులకు సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం

జగదాంబ కూడలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమ్మవారి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. విక్టోరియా వద్ద పార్కింగ్‌ను, క్యూలైన్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఏసీపీ కాళిదాసు, వన్‌టౌన్ సీఐ దేముడుబాబు, ఈవో కె. శోభారాణి, ఇంజనీరు రమణ ఉన్నారు.



రూప కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్ పక్కన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కార్యకర్తల యోగక్షేమాలు ముఖ్యం

- మంత్రి నాదెండ్ల మనోహర్

డాబాగార్డెన్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తల యోగ క్షేమాలు తమకు ముఖ్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం రాత్రి ఆయన 31వ వార్డు జనసేన మహిళా నాయకులు కొల్లి రూప ఇంటిని సందర్శించారు. వార్డులోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు గురించి మంత్రి ఆరా తీయడం ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు ఎలా ఉన్నారో వారి స్థితిని తెలుసుకోవడం గొప్ప విషయమన్నారు.



కన్యకా పరమేశ్వరి అమ్మవారు, పూజలు చేస్తున్న భక్తులు

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున నాలుగు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వర్ణ పుష్పార్చన, తామర గింజలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, సామూహిక లలితా సహస్రపారాయణం జరిపారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేవారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి చదరంగం పోటీలు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఎండాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు సౌత్ జోన్ స్థాయిలో మహిళల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు. విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన జిమ్‌సర్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 65 వర్సిటీల నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్టు తెలిపారు. అలాగే వంద మంది మేనేజర్లు, పది మంది అధికారులు పాల్గొంటారన్నారు. గీతం వైద్య కళాశాలలోని ఎల్లా ప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గీతం క్రీడా విభాగం మేనేజర్ రితేశ్ సిన్హా, తదితరులు ఉన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు బంగారు సంపెంగలతో పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అందరికీ వైద్యం.. ప్రభుత్వం లక్ష్యం

మధురవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అందరికీ వైద్యం.. ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పద్మావతి అన్నారు. వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తున్న రోగులందరికీ మెరుగైన సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. గురువారం ఆమె మధురవాడ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ పీహెచ్‌సీకి వచ్చే వారికి సక్ర మంగా సేవలందించాలన్నారు. మందుల స్టాక్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని వైద్యాధికారి ప్రశాంతికి సూచిం చారు. అనంతరం ఆమె పీహెచ్‌సీ పరిధిలో క్షయ నివారణకు చేపట్టిన చర్యలు, పిల్లలకు ఇమ్యూనైజేషన్ టీకాలు, గర్భిణిలకు అందుతున్న సేవలు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోపీనాథ్, వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కిల్ హబ్ ఆధ్వర్యంలో పదో తరగతి పాసైన వారికి ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు.మూడు నెలల శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ప్రభుత్వ పాత ఐటీఐ కార్యాలయంలో సంప్రతించాలని, వివరాలకు 7702506614 నంబరుకు కాల్ చేయాలన్నారు.

నగరానికి చేరుకున్న సీఎం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 6.45 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

ఇన్‌చార్జి మంత్రిని అడ్డుకున్న పోలీసులు

సీఎం చంద్రబాబు సీరియస్

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసేందు కు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులను కూడా లోపలకు అనుమతించలేదు. ఆ సమయంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది కూడా అతిగా ప్రవర్తించడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడిరామకృష్ణబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం సీఎంకు వెలగపూడి ఫిర్యాదు చేశారు. పార్టీనాయకులను లోపలకు రాకుండా ఎలా ఆపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని మందలించారు. తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులను అనుమతించాలని చంద్రబాబు ఆదేశించారు.

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ప్రశ్నలు మాత్రం ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సుకు సంబంధించినవి ఇచ్చారు. విద్యార్థులు విషయాన్ని ఇన్విజిలేటర్‌కు తెలియజేశారు. అయితే, ఆయా కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు పరీక్ష హాల్ నుంచి వెళ్లడానికి లేదని, అబ్జర్వర్‌కు విషయాన్ని తెలియజేశామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతామని, పరీక్షకు హాజరైనట్టు హాల్ టికెట్ నంబర్లు వేసి ఇవ్వాలని అబ్జర్వర్లు సూచించారు. కాలేజీ యాజమాన్యాల ద్వారా ఈ విషయాన్ని ఏయూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు పలువురు గురువారం ఉదయం వర్సిటీకి వెళ్లి ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేసినప్పటికీ అవకాశం ఇవ్వలేదని తెలిసింది.

అదే తప్పు..

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గురువారం కూడా అదే తప్పిదం జరిగింది. గురువారం ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సు చదివే విద్యార్థులకు ఫంక్షనల్ ఫుడ్ అండ్ న్యూట్రిస్యూటికల్స్ పరీక్ష నిర్వహించాలి. అయితే, జరిగిన ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులోని కెమిస్ట్రీ అండ్ ఫ్యాట్స్ అండ్ ఆయిల్స్ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలను ఇచ్చారు. కోర్సు పేరు, పేపర్ వివరాలను ఒకలా, అందులో ఇచ్చిన ప్రశ్నలు మరోలా ఉండడంతో విద్యార్థులు కనీసం పెన్ను కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఏయూ వీసీ ప్రొఫెసర్ జి శశిభూషణరావును వివరణ కోరగా తప్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూస్తామని, అవసరమైతే పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు. దీనిపై అధికారులతో మాట్లాడతామని వివరించారు.

నేడు నీతి ఆయోగ్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సమాచారం ప్రకారం ఏ విధమైన చర్యలు చేపట్టాలనే దానిపై నీతి ఆయోగ్ ఒక నివేదిక రూపొందించింది. దానిని బృందం జిల్లా అధికారులకు వివరించి, వివిధ శాఖలు ఏ విధంగా ముందుకువెళ్లాలో మార్గదర్శనం చేస్తుంది. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ బృందంతో పాటు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు పాల్గొంటారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదు చేస్తామన్నారు. సదస్సుల్లో వచ్చిన వినతులు 45 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ రేపు

జిల్లాలోని 595 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల ఏడో తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రాలను సంబంధిత హెచ్ఎం ద్వారా తల్లిదండ్రులకు పంపామన్నారు. మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రుల సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల చదువు, క్రమశిక్షణ గురించి తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు. అందువల్ల తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. విలేకరుల సమావేశంలో డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమానికి స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గతంలో పలుమార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించినప్పటికీ అనివార్య కారణాల వల్ల పూర్తిస్థాయిలో సాధ్యపడలేదన్నారు. కానీ ఇప్పుడు మాత్రం శతశాతం నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల ఉత్పత్తిని పెంచేందుకు వ్యాపారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల మార్కెట్‌కు కూడా అవకాశాలు కల్పిస్తామన్నారు. గతంలో వీటి ధరలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కంటే చాలా ఎక్కువ ఉండడంతో కొనుగోలుదారులు వాటి జోలికి వెళ్లేవారు కాదన్నారు. కానీ ఇప్పుడు వాటి ఉత్పత్తి భారీగా పెరగడంతో ధరలు కూడా గణనీయంగా తగ్గి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దాదాపు సమానంగా ఉంటాయన్నారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అందరూ విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ట్రాయ్ పేరుతో కాల్స్

... 5వ పేజీ తరువాయి

యుగం నడుస్తుండడంతో చాలామంది ఫోన్‌లోనే గడుపుతున్నారు. దీంతో ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని, పరిమితికి మించి కాల్స్ మాట్లాడుతున్నారని సైబర్ మోసగాళ్లు చెప్పేసరికి, బాధితులు నిజమేనని భావిస్తున్నారు. ఈ క్రమంలో అవతలివారు చెప్పినట్టు చేసి తమ ఫోన్ నంబర్ బ్లాక్ కాకుండా రెన్యువల్ చేసుకోవాలనుకుంటున్నారు. తీరా ఖాతాలు ఖాళీ అయిపోతుండడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ట్రాయ్, బ్యాంకుల పేరుతోగానీ, సీబీఐ, కస్టమ్స్ అధికారులమంటూ గానీ కొరియర్ వచ్చిందని గానీ ఎవరైనా ఫోన్ చేసినా, కేసు లేకుండా చేసేందుకంటూ డబ్బులు కావాలని అడిగినా ఎవరూ నమ్మకూడదని సైబర్ క్రైమ్ సీఐ బీఎండీ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు ఏదోవిధంగా మోసం చేసేందుకు యత్నిస్తుంటారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి బ్యాంకు ఖాతా వివరాలను బయటకు వెల్లడించవద్దని కోరారు.

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

... 5వ పేజీ తరువాయి

కొద్దినెలల క్రితం జరిగింది. వారి చేతిలో సుమారు 40 మంది వరకు మోసపోయారు. సుమారు రూ.70 లక్షల వరకు వసూలు చేసుకొని ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది.

ఉద్యోగం ఇచ్చాక వేధింపులు

నగరంలో ఉన్న ఓ ఐటీ కంపెనీ ఈ ఏడాది మార్చి నెలలో బీటెక్ పాసైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించింది. సుమారు 30 మందిని తీసుకుంది. వారికి అన్నీ కలిపి ఏడాదికి రూ.1.8 లక్షల జీతం ఇస్తామని ఆఫర్ లెటర్ ఇచ్చింది. అంటే నెలకు సుమారు రూ.15 వేల జీతం. ఎటువంటి అనుభవం లేనందున, శిక్షణ ఇవ్వాలి కాబట్టి, అది పూర్తయ్యాక వెళ్లిపోకుండా ఉండడానికి డిపాజిట్ కట్టాలని ఒత్తిడి పెట్టింది. కొందరి వద్ద రూ.3 లక్షలు, మరికొందరి వద్ద రూ.6 లక్షలు చొప్పున వారి తల్లితండ్రుల నుంచి అడ్వాన్స్ చెక్కులు తీసుకుంది. మూడు నెలల ప్రొబేషన్ తరువాత రెగ్యులర్ చేస్తామని, అప్పుడు జీతం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. యువతీ యువకులు ఉత్సాహంగా చేరారు. అయితే వారిలో 80 శాతం మందికి ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ఏ బాధ్యత అప్పగించలేదు. నెల నెలా జీతం మాత్రం ఇచ్చింది. ఏదైనా పని చెప్పాలని కొందరు కోరితే...'మీకు ఏమి చేతనవుతుంది? ఏమీ చేయలేరు.' అంటూ కంపెనీ ప్రతినిధులు ఎగతాళి చేయడం ప్రారంభించారు. తాము చేరి మూడు నెలలు దాటింది కాబట్టి జీతం పెంచాలని నలుగురైదుగురు కోరగా, 'ఇదే మీకు ఎక్కువ' అంటూ వెటకారం చేశారు. దాంతో తాము ఉద్యోగం మానేస్తామని, సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే వారిని మరింత వేధించడం ప్రారంభించారు. మూడు నెలల ముందు నోటీసు ఇవ్వడంతో పాటు రూ.3 లక్షలు కట్టాలని, అప్పుడే సర్టిఫికెట్లు, అడ్వాన్స్ చెక్కులు వెనక్కి ఇస్తామని నిబంధన పెట్టారు. ఇచ్చిన జీతం లక్ష రూపాయలు కూడా లేదని, మూడు లక్షలు ఎందుకు ఇస్తామని అడిగితే, నచ్చింది చేసుకోండి..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని ఓ ఎమ్మెల్యేను కలిసి జరిగిందంతా వివరించారు. ఆ కంపెనీ తన నియోజకవర్గంలోనే ఉండడంతో ఆ పోలీస్ స్టేషన్ అధికారికి ఫోన్ చేసి, పిల్లలకు న్యాయం చేయాలని సూచించారు. అక్కడ ఈ పంచాయితీ మూడు రోజులు నడిచింది. పిల్లలను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించుకొని కింది స్థాయి అధికారి యాజమాన్యానికి వత్తాసు పలికారు. ఈ విషయం మళ్లీ ఎమ్మెల్యేకు చెప్పడంతో, ఆయన స్టేషన్ అధికారికి మరోసారి ఫోన్ చేశారు. ఒక్కొక్కరు రూ.1.5 లక్షలు చొప్పున చెల్లిస్తే తప్ప సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కంపెనీ ప్రతినిధులు ఒప్పుకోకపోవడంతో ఆ ఒప్పందం ప్రకారం కేసు సెటిల్‌మెంట్ చేశారు.డబ్బులు కట్టాకేవారి సర్టిఫికెట్లు వెనక్కిఇచ్చారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. ఉదయం 8గంటలకు అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

8న మాలల చలో విశాఖ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సింధియా, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ఈ నెల 8న జరగనున్న మాలల చలో విశాఖ సింహ గర్జన విజయవంతం చేయాలని మాటూరి చిన్నారావు పిలుపునిచ్చారు. 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో గురువారం మాల నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోజు ఏడు వార్డుల మాలలు కలసి సుమారు 300 బైకులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గుడాల ఈశ్వరరావు, పునుకు రమణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నరవ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్తు ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్టు వేపగుంట ఏఈ సురేష్ తెలిపారు. నరవ, జెర్రిపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, చింతగట్ల పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

వీఎంఆర్డీఏ మ్యూజియంల ప్రవేశ రుసుము తగ్గింపు

సిరిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు మ్యూజియం ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ రుసుములో రాయితీ కల్పిస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలు భావి తరాలకు చాటి చెప్పేలా 40 నిమిషాల నిడివితో లైట్ అండ్ మ్యూజిక్ ప్రదర్శనకు ప్రవేశ రుసుం రూ.60 ఉండేదని, విద్యార్థులకు రూ.40కే ప్రవేశం కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి సమన్వయ సహకారంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న అన్ని మ్యూజియాల్లో ప్యాకేజీ పద్ధతిలో రాయితీలు వర్తింపజేయనున్నట్టు తెలిపారు. ప్యాకేజీ-1 కింద కురుసుర, టీయూ-142, సీ హారియర్ తెలుగు మ్యూజియంలకు రూ.100, ప్యాకేజీ-2 కింద కురుసుర, టీయూ 142, సీ హారియర్ మ్యూజియంలకు రూ.60 ప్యాకేజీ-3 కింద తెలుగు మ్యూజియం టాయ్ ట్రెన్‌లకు రూ.100 వసూలు చేస్తామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కిల్ హబ్ ఆధ్వర్యంలో పదో తరగతి పాసైన వారికి ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు.మూడు నెలల శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ప్రభుత్వ పాత ఐటీఐ కార్యాలయంలో సంప్రతించాలని, వివరాలకు 7702506614 నంబరుకు కాల్ చేయాలన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2**: జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ మోహిని, లక్ష్మి(గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 32, బంగాళదుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

బస్టాప్‌లలో ఆటోల హల్‌చల్

» తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు
» పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
» ఆర్టీసీ ఆదాయానికి భారీ గండి

గాజువాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత ప్రధాన బస్టాప్‌ల్లో ఆటోలను యథేచ్ఛగా నిలిపి వేస్తుండడంతో వాహన రాకపోకలతోపాటు బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. బస్టాప్‌లో


గాజువాక బస్టాప్ వద్ద రోడ్డుపైనే ఆటోలు

ఆటోలే నిలపడంతో బస్సుకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. దీనివలన ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది. మరోవైపు బస్టాప్‌లోకి ఆటోలు అనుమతించకుండా పర్యవేక్షించాల్సిన ఆర్టీసీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారింది. ప్రధానంగా పాతగాజువాక నుంచి కొత్తగాజువాక జంక్షన్ మధ్య ఉన్న బస్టాప్‌ల వద్ద ఈ పరిస్థితి ఉంది. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికుల వద్దకు ఆటోలు నేరుగా వెళ్లి వారిని ఎక్కించుకుంటున్నారు. బస్టాప్‌ల్లోకి ప్రైవేట్ వాహనాలు రాకుండా పర్యవేక్షించేందుకు ఆర్టీసీ యాజమాన్యం హోంగార్డ్‌తో పాటు సిబ్బందిని నియమించినా సరిగా విధులు నిర్వర్తించకపోవడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయనే విమర్శలున్నాయి. బస్టాప్‌లు ఆటోలతో నిండిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురవుతోంది. రెండు రోజుల క్రితం పాతగాజువాక జంక్షన్ బస్టాప్ వద్ద ఓ ఆటోను సడన్‌గా నిలిపివేయడంతో వెనక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొని గాయపడ్డాడు. ఈ పరిస్థితి గాజువాక ప్రాంతంలో నిత్యం చోటుచేసుకుంటుంది. అంతేకాకుండా ఇక్కడి పరిస్థితిని పర్యవేక్షించాల్సిన


పాత గాజువాక బస్టాప్‌లో నిలిపి ఉంచిన ఆటోలు

ట్రాఫిక్ పోలీసులు కూడా పట్టించుకోకపోడంతో ఆటోల ఇష్టారాజ్యంగా మారుతోంది.

బస్టాప్‌లోకి ఆటోలు అనుమతించరాదు

బస్టాప్‌ల్లోకి ఆటోలు అనుమతించకుండా చర్యలు చేపట్టాలని పలువురు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఆటోలు రాకుండా పర్యవేక్షణ నిమిత్తం సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని కోరుతున్నారు. నిబంధనలు పాటించని ఆటోల డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా గంధం శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

పెదగంట్యాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు గురువారం నడుపూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గంధం శ్రీనివాసరావుకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లగా రాజకీయాల్లో ఉంటూ రెండుసార్లు వరుసగా గాజువాక మునిసిపాలిటీలో కౌన్సిలర్‌గా, మరో రెండు సార్లు జీవీఎంసీ కార్పొరేటర్‌గాను విజయం సాధించిన గంధం శ్రీనివాసరావు ప్రజల మనిషిగా నిలిచారన్నారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేటర్‌గా గంధం శ్రీనివాసరావు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ముత్యాల నాయుడు, బొండా జగన్, రౌతు శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ఇల్లపు రాము, బాసెట్టి అప్పారావు, పీత రమణ, పంచదార్ల ఉగ్రం, వియ్యపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడుపూరు అనాధాశ్రమంలోని పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు.


కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, శ్రీనివాసరావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

కార్మికుల సస్పెన్షన్‌పై ఐక్య పోరాటం

» ఎన్ఏడీ సీఈ యూనియన్ గౌరవాధ్యక్షుడు థామస్


ఎన్ఏడీ గేటు వద్ద నిరసనలో యూనియన్ నాయకులు, కార్మికులు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ సీజీఎం చేపట్టిన కార్మికులు సస్పెన్షన్లను రద్దు చేసే వరకు సమష్టిగా పోరాడాలని ఎన్.ఎ.డి. సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎవి. థామస్ పిలుపు నిచ్చారు. ఎన్.ఎ.డి. గేటువద్ద గురువారం ఎన్.ఎ.డి. కార్మికులు చేపట్టిన సత్యాగ్రహ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశచరిత్రలో ఒకేసారి కార్మికులపై పోలీసు కేసు నమోదు, 36 మంది సస్పెన్షన్ చేయడం జరగలేదన్నారు. సీజీఎం కార్యాలయానికి వెళ్లనివారిని, సమావేశంలో పాల్గొనని వారిని సైతం సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేయగానే ఏడుగురి సస్పెన్షన్లు రద్దు చేశారన్నారు. గత 20 ఏళ్లుగా ఎన్.ఎ.డి. డాక్‌యార్డ్‌లో అమలవుతున్న స్ట్రోరేజీ ఓటీ విధానాన్ని మార్చివేసి కొత్తవిధానం అమలు చేయడం తగదన్నారు. గతంలో పని చేసిన సీజీఎంలు అనుసరించిన విధానాన్ని తప్పుబట్టి కార్మికులు ఆర్థిక ప్రయోజనాలను కాలరాయటంఅన్యాయమన్నారు. ఇప్పటికైనా సీజీఎం తీరు మార్చుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మెన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్.ఎ.డి. సీజీఎమ్ కార్మిక వ్యతిరేక విధానాలపై ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ప్రభుత్వ విప్ గణబాబుకు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనె 8వతేదీన ఎన్.ఎ.డి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు చేపట్టే బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఈఎఫ్ అఖిలభారత కార్యవర్గ సభ్యులు పి.గోపాలకృష్ణ, సీఈ యూనియన్ అధ్యక్షుడు పి.నూకరాజు తదితర నాయకులు, కార్మిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సీజీఎమ్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న పెందుర్తి తహసీల్దార్

పెందుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు.గురువారం తన కార్యాలయంలో జరిగిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లోవచ్చిన వినతులు అక్కడికక్కడే పరిష్కరించేలా చూడాలన్నారు. ఈనెల 6న ముదపాక, పినగాడి,7న పెదగాడి, క్రిష్ణరాయపురం, 10న పెందుర్తి, నరవ 11వతేదీన పొర్లుపాలెం, పులగాలిపాలెం, 12న లక్ష్మీపురం, చినముషిడివాడ, 13న చీమలాపల్లి, పురుషోత్తపురం, 17న వేపగుంట. జెర్రిపోతులపాలెం, 18న గుర్రమ్మపాలెం, గొరపల్లి, 19న రాంపురం, ఎస్ఆర్‌పురం, 20న వాలిమెరక, సరిపల్లి, 21న రాజయ్యపేట, జుత్తాడ, 24న చింతగట్లతో రెవెన్యూ సదస్సులుంటాయన్నారు.

ములగాడ మండలంలో పది నుంచి

మల్కాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలంలోని ములగాడ, మల్కాపురం, గుల్లపాలెం ప్రాంతాలలో ఈనెల 10, 13, 28 తేదీలలో సమావేశాలు జరుగుతాయని తహసీల్దార్ భుజంగరావు తెలిపారు. మండల కార్యాయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ మల్కాపురం మెయిన్‌రోడ్డులోని మరిడిమాంబ కల్యాణమండపంలో 10వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు, గుల్లలపాలెం మాజీ సైనికుల కాలనీలో 13న, ములగాడ జంక్షన్‌లోని శ్రీకృష్ణయాదవ సంఘం హాల్లో 28న భూమి సమస్యలు ఉన్నవారు హాజరుకావాలన్నారు.

గోపాలపట్నంలో 9 నుంచి

ఎన్ఏడీ జంక్షన్: గోపాలపట్నం మండలంలో రెవెన్యూ పరిధిలో భూ సమస్యలపై ఈ నెల 9 నుంచి వచ్చేనెల 8 వరకు రెవెన్యూ సమావేశాలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, ఎల్లపువానిపాలెం, కంచరపాలెం వార్డు, కంచరపాలెం విలేజ్, కప్పరాడ, మాధవధార, మర్రిపాలెం, వెంకటాపురంల్లో జరిగే ఈ రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలన్నారు.

అంగరంగ వైభవంగా గౌరమ్మ తల్లి సంబరాలు

ఆటోనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 70 వార్డు టీవీఎస్ కాలనీలో గురువారం గౌరమ్మతల్లి సంబరాలు నిర్వహించారు. గవరుల ఆరాధ్య దైవం గౌరమ్మ తల్లి విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు, బొడ్డేడ రమణ, టీఎస్‌టీయూసీ నాయకులు పీఎంఎల్ నాయుడు, వెలగ నూకరాజు, ఆడారి రామకృష్ణ, వెలగ శ్రీను, ఎంఎస్ఎన్ రాజు, సూరిబాబు, రామకృష్ణ, చంద్రరావు, రాజు బాబాయ్, జ్యోతి, ఉమ, మహిళా భక్తులు పాల్గొన్నారు.


గౌరమ్మతల్లి పూజల్లో పాల్గొన్న భక్తులు

షిర్డీసాయికి విశేష పూజలు

అగనంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 85వ వార్డు పరిధి అగనంపూడిలోని షిర్డీసాయి బాబా ఆలయంలో స్థానిక షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సేవా సమితి ఆర్థిక సాయంతో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాగణంలో విష్ణు సహస్ర, లలితా సహస్ర, బాబా చాలీసా పారాయణం పఠించారు. ఈ కార్యక్రమంలో కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, రాజు, లీలావతి, సత్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, జ్యోతి, కుసుమ, పద్మ, శ్రీదేవి, సత్యశ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో ...

అగనంపూడి: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో మార్గశిర మాసం తొలి గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

గోపాలపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేదంపై స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-8 ఏఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్రముప్పు వాటిల్లుతుందన్నారు. సముద్ర గర్భంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి జలాలు కలుషితమవుతున్నాయన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్నామ్నాయ వస్తువులను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెందుర్తిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో గురువారం జీవీఎంసీ సౌజన్యంతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ సహాయక వైద్యాధికారి అప్పలనాయుడు మైక్రో ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పలితాలను వివరించారు. సే నో ప్లాస్టిక్ నినాదం విద్యార్థులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కరస్పాండెంట్ థియోఫిలస్, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు ప్రిన్సిపాల్ ఫ్లోరా, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్‌తో పాటు రాయితీలివ్వాలి


మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు

పెదగంట్యాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలుగా నిర్ణయించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దీనబంధు డిమాండ్ చేశారు. ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత శాఖ గురువారం పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెన్షనర్లకు రైల్వే రాయితీ ఎత్తివేశారని, దానిని పునరుద్ధరించాలని కోరారు. పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులు ఇచ్చి, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు కణితి అప్పలరాజు మాట్లాడుతూ పెన్షనర్ల సంరక్షణలో భాగంగా ఆరోగ్య శ్రీకార్డులు జారీ చేయాలన్నారు. ఈ నెల 17న పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

గంగవరం పోర్టులో గ్రాబ్ షిప్ క్రేన్లు ప్రారంభం


క్రేన్ ప్రారంభోత్సవంలో కార్మికులు, అధికారులు

గాజువాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో రెండు అత్యాధునిక ఎకనామిక్ గ్రాబ్ షిప్ క్రేన్‌లు ప్రారంభమయ్యాయి. ఆధునాతన ఎలక్ట్రిక్ క్రేన్‌లు లోడ్, అన్‌లోడ్, ఇతర బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడతాయని యాజమాన్యం పేర్కొంది. వినియోగదారులకు మెరుగైన సేవలు సత్వరమే అందించేందుకు వీలవుతుందన్నారు. వాణిజ్య సేవల్లో తమ పోర్టు అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొంది. దేశంలోనే మొట్టమొదటి ఎకనామిక్ గ్రాబ్ షిప్ క్రేన్‌లు ఇక్కడ ప్రారంభించినట్టు తెలిపింది. కార్యక్రమంలో పోర్టు యాజమాన్యం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దల బాటలో నడిస్తేనే భవిష్యత్తుకు మేలు


వేడుకల్లో చిన్నారుల వివిధ వేషధారణలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దల మాటలు ఆచరిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని స్టీల్‌ప్లాంట్ డీజీఎం (హెచ్‌ఆర్) ఎస్‌వీఎస్ రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ డీపీఎస్‌లో గురువారం గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలు తమ అనుభవ పూర్వకంగా చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగితే అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు. ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే మాట్లాడుతూ చక్కని ప్రణాళితో విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పిల్లల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

అగనంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు పేద కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడారు. ఆపదో ఉన్న పేదలకు ఆదుకోవడమే ధ్యేయంగా పలు సేవా కార్య క్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, పట్టా రామఅప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, నరసింగరావు, మస్తాన్‌రెడ్డి, జామి గణేశ్, గంధోళి వెంకటరమణ, వరలక్ష్మి, పిల్లా శ్రీనివాస్, బొండా ఈశ్వరరావు, పూడి నరేశ్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై విద్యార్థుకు అవగాహన


గాయత్రిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి, డిసెంబరు 5: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం, ఆహార శాస్త్రం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యూట్రీషియన్ గాయత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులంతా పౌష్టిహారం తీసుకోవాలన్నారు. ఆహారం తీసుకునే పద్ధతులను వివరించారు. ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లను పోత్సహించడం, ఆహార సంబంధిత అపోహలు, స్థిరమైన జీవన శైలి తదితర అంశాలను వివరించారు. అనంతరం ఆమెను విజ్ఞాన్ యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

శనివాడలో సెమీ క్రిస్మస్ వేడుకలు

అగనంపూడి, డిసెంబరు 5: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడలోని క్రైస్తవ సంఘాలు, పీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానికంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి దశేంద్ర, గవర సోమశేఖర్, బి. సత్యనారాయణ, మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, నాగేశ్వరరావు, గల్లా సూర్యానారాయణ, రుద్రకుమార్, వసంత్, డేవిడ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే గణబాబు


అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ పెంటకోట అప్పారావు సేవలు చిరస్మరణీయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కొనియాడారు. అప్పారావు 76వ జయంతి సందర్భంగా 57 వార్డు సుభాష్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేశారు. అప్పారావు కుమారుడు అజయ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మి, శరగడం రాజశేఖర్, కుట్టా కార్తీక్, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ


ర్యాలీ ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, తదితరులు

గోపాలపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌టీఎల్‌లో నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా గురువారం చేపట్టిన ర్యాలీని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా భారత్, శ్రేష్ఠతా భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్ రెసిడెన్షియల్ క్యాంపస్ ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త సీహెచ్‌వీ సత్యశ్రీనివాస్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

రామ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా శుక్రవారం నుంచి 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువ సమ్మేళనం నగరంలో గీతం యూనివర్సిటీ వేదికగా డిసెంబరు 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 200 మంది యువతీ యువకులు పాల్గొంటారని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో గిరిజన సంస్కృతి, వారి అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు పలు అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

అత్తెసరు జీతం... వస్థల జీవితం!

ఇదీ హోంగార్డుల పరిస్థితి

- పోలీసులతో సమానంగా పనిచేసిన ఫలితం శూన్యం
- సమస్యల పరిష్కారానికి ఏళ్లుగా ఎదురుచూపులు
- నేడు హోంగార్డ్స్ రైజింగ్‌డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

వారంతా పేరుకు హోంగార్డులు. పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తారు. ఒక్కోసారి అంతకుమించి కష్ట పడతారు. ప్రభుత్వం నుంచి అందే సదుపాయాలు మాత్రం అరకొరే... ఎంత పనిచేసినా.. ఉన్నతాధికారుల నుంచి చీద రింపులు.. వేధింపులే వారికి బోనస్. గత ఎన్నికలకు ముందు హోంగార్డులకు తెలంగాణ మాదిరిగా వేతనం, సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. నేడు 'హోంగార్డు రైజింగ్ డే' సందర్భంగా కథనం.



దేశంలోని త్రివిధ దళాలకు సహాయం అందించే లక్ష్యంతో బొంబాయి ప్రావిన్స్‌లో 1946 డిసెంబరు ఆరున హోంగార్డ్స్ పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేశారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో వీరి సేవలను వినియోగించుకునేవారు. కాలక్రమేణా పోలీస్‌శాఖలోనూ నియమించుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో వినియోగించుకోవడం మొదలైంది. ఇందులో సేవ చేసేవారికి గౌరవవేతనం అందజేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో హోంగార్డు స్వచ్ఛందసేవా సంస్థగా కాకుండా ఉపాధినిచ్చే ఉద్యోగంగా మారిపోయింది.

నగరంలో ప్రస్తుతం 1,069 మంది హోంగార్డులున్నారు. వీరిలో 210 మంది మహిళలు. 186 మంది రవాణా, ఆర్టీసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సీబీడీ వంటి ప్రభుత్వ శాఖలతోపాటు వివిధ ప్రైవేటు కంపెనీల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలినవారంతా శాంతిభద్రతలు, క్రైమ్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేస్తున్నారు. పోలీసులతో సమానంగా రాత్రిపూట గస్తీలు, పహారా కాస్తుంటారు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తారు. అయితే కానిస్టేబుళ్లకు వేలల్లో జీతం, అలవెన్సులు, షిఫ్ట్ డ్యూటీలు, విశ్రాంతి, వేతనంతో కూడిన సెలవులు, ఆరోగ్యబీమా, వైద్యసదుపాయం, పిల్లల చదువులు, ఇళ్ల నిర్మాణాలకు రుణాలు, సబ్సిడీపై నిత్యావసరాలు వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. హోంగార్డులకు మాత్రం రోజుకి రూ.710 చొప్పున వేతనం, నెలకు రెండు సెలవులు మాత్రమే ఇస్తోంది. అనారోగ్యం, అత్యవసర పరిస్థితులు, కుటుంబ అవసరాల కోసం హాజరుకాలేకపోతే ఆరోజు వేతనం కట్ చేస్తుంది. ప్రమాదవశాత్తు మరణించినా, అనారోగ్యానికి గురైనా ప్రభుత్వం నుంచి పరిహారం ఉండదు. షిఫ్టులతో పనిలేకుండా అధికారులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరుకావాల్సి ఉంటుంది. కొంత మంది హోంగార్డులు అధికారుల ఇళ్లలో వంట, బట్టలు ఉతకడం, ఇంటి పనులు, పిల్లలు, వృద్ధుల ఆలనాపాలనా చూసుకోవడం వంటి విధులను నిర్వరిస్తున్నారు. అయినప్పటికీ చీత్కారాలు, చీదరింపులు తప్పడం లేదు.

కానిస్టేబుళ్ల కంటే కష్టపడి పనిచేసే హోంగార్డులు తమ యూనిఫారంపై కనీసం పోలీస్‌లోగో వేసుకునేందుకు కూడా వీలులేక తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. గతంలో ఏటా రెండు జతల యూనిఫాం, వారాంతపు సెలవులు ఇచ్చేవారని, వాటినీ తీసేశారంటున్నారు.

ఇవీ డిమాండ్లు

రోజువారీ వేతనంపై పనిచేసే హోంగార్డులు సమస్యల పరిష్కారం కోసం ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. వీరికి నెలకు రూ.21,300 వస్తుండడంతో సంక్షేమ పథకాలకు అనర్హులయ్యారు. ఇళ్లలోని వృద్ధులకు పింఛను ఇవ్వడం లేదు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా చర్యల్లేవు. హోంగార్డుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ఆరోగ్యశ్రీ సదుపాయం కల్పించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఉద్యోగ విరమణ చేసినా, విధినిర్వహణలో మృతిచెందినా పరిహారం, పెన్షన్ లేవని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయంటున్నారు. మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవును ఆరునెలలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద కనీసం రూ.పది లక్షలు ఇవ్వాలని, విధినిర్వహణలో మృతిచెందినవారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షల పరిహారం కోరుతున్నారు.

నేడు సీపీ ముఖాముఖి

ఏటా డిసెంబరు ఆరున హోంగార్డ్సు రైజింగ్‌డే వేడుకలను పోలీస్‌బ్యారెక్స్‌లో నిర్వహిస్తారు. కార్యక్రమానికి నగర పోలీస్‌కమిషనర్ హాజరై హోంగార్డుల పరేడ్‌ను తిలకించి, గౌరవవందనం స్వీకరిస్తారు. హోంగార్డుల సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇస్తారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం నగరంలో పర్యటించనుండడంతో హోంగార్డ్స్ రైజింగ్ డే రద్దుచేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు ఏఆర్‌బ్యారెక్స్‌లోని టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్‌లో హోంగార్డులతో సీపీ ముఖాముఖి మాట్లాడాలని నిర్ణయించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి (కుడి నుంచి ఎడమకు)



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



ఎయిర్‌పోర్టు వద్ద అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి



ఎయిర్‌పోర్టు వద్ద నాయకులతో మాటా మంతీ



సీఎం చంద్రబాబును కలిసిన భీమిలి ఎమ్మెల్యే గంటా



పార్టీ కార్యాలయంలోకి వెళ్తున్న సీఎం చంద్రబాబు

వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



ప్రణవ్ గోపాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి ఎమ్మెల్యేలు

విశాఖపట్నం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రణవ్ గోపాల్‌ను గురువారం కూటమి ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలి వారం.. పోటెత్తిన భక్త జనం



భక్తులతో కిటకిటలాడిన క్యూ లైన్లు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

- కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు
- కిటకిటలాడిన క్యూలైన్లు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగిన రద్దీ

జగదాంబ కూడలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున మూడు గంటల నుంచే ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. నగరం నలు మూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వీఐపీలు, వీవీఐపీలతో సం బంధం లేకుండా సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్న వారికి ఈవో తాగు నీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఏవీఎన్ కాలేజీ నుంచి బస్సులను మళ్లించారు. టౌన్ కొత్త రోడ్డు వద్ద వాహనాల ప్రవేశాన్ని నిషేధించారు. రీడింగ్ రూమ్ నుంచి కురుపాం మార్కెట్ వరకు రహదారి క్లియర్‌గా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు కలగలేదు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మంత్రి నాదెండ్లకు సాదర స్వాగతం



ఎయిర్‌పోర్టులో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

గోపాలపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గురువారం ఉదయం 9 గంటలకు చేరుకున్న నాదెండ్లకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పశ్చిమ జనసేన పార్టీ నాయకురాలు అంగదుర్గా ప్రశాంతి, నగర జనసేన పార్టీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గంలో నగరానికి వెళ్లారు.

ఆర్టీసీ క్రీడాకారుల ట్రయల్ రన్



పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో క్రీడాకారులు, అధికారుల ట్రయల్ రన్

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అంతర్రాష్ట్ర ఆటల పోటీలు జరగనున్నాయి. కైలాసగిరి పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా గురువారం క్రీడాకారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. పలువురు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్ప స్తంభం వద్ద సీఎస్ నీరభ్‌కుమార్

సింహాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని గురువారం పలువురు ప్రము ఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, పట్టణాభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ కె.పద్మావతి ఉన్నారు. వారికి అధికారులు త్రిమూర్తులు, సునీల్‌కుమార్, ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో పూజలు తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

భీమిలిలో ఘనంగా కళా ఉత్సవ్ ప్రారంభం



నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థినుల జానపద నృత్యం

భీమునిపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డైట్ కళాశాలలో ఉమ్మడి జిల్లా కళా ఉత్సవ్ గురువారం ప్రారంభమైంది. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యాలు, గీతాలాపనలతో సభికులు కేరింతలు కొట్టారు. రెండు రోజుల పాటు జరగనున్న ఉత్సవ్‌లో మొదటి రోజు ఆరు పాఠశాలల నుంచి 75 మంది కళాకారులు హాజరయ్యారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్, సాయి, కుమార్ బృందం జానపద యుగళ గీతానికి నృత్య ప్రదర్శన ఇచ్చారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశానికి సమాచారంతో సిద్ధంగా ఉండాలి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్, హాజరైన అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరిగే కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి అధికారులంతా పూర్తిగా సన్నద్ధమవ్వాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అజెండాలోని అంశాలపై అన్నివిభాగాల అధిపతులతో కమిషనర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజెండాలోని అన్ని అంశాలను అధికారులు లోతుగా అధ్యయనం చేయా లని, ఆయా అంశాలపై సభ్యులు ప్రశ్నలు అడిగినా, అభ్యంత రం లేవనెత్తినా సమాధానం ఇచ్చేందుకు పూర్తిసమాచారంతో సిద్ధంగా ఉండాలని స్పష్టంచేశారు. సభ్యులు ఏదైనా ప్రశ్న , వివరణ అడిగితే అధికారులు తడబడుతున్నారని, అది సరికాదన్నారు. గతంలో జరిగిన సమావేశాల్లో లేవనెత్తిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వాల్సి వుంటుందని, వాటిపైనా సమగ్ర సమాచారం సేకరించుకుని సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు, అన్నివిభాగాల అధిపతులు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

క్రైం... crime news

లారీ డ్రైవర్‌పై మందుబాబుల దాడి



గాయపడిన రఫీ

మల్కాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ ట్యాంకర్ డ్రైవర్ రఫీపై మందుబాబులు బుధవారం రాత్రి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో సస్పెండ్‌కు గురైన ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర కూడా ఉన్నాడు. వివరాలిలా ఉన్నాయి. ట్యాంకర్ల పార్కింగ్ ప్రదేశంలో టి.బాలచందర్, బి.లోకేష్, డి.రాజేష్, ఏఆర్ కానిస్టేబుల్ సీహెచ్ నరేంద్ర మద్యం సేవిస్తున్నారు. డ్రైవర్ రఫీ వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించడంతో కోపంతో రఫీపై విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచారు. తీవ్ర రక్తస్రావంతో అతడు కుప్పకూలిపోవడంతో పరారయ్యారు. సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసిన వారిని గుర్తించి, అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని డ్రైవర్లు ట్యాంకర్ల లోడింగ్ నిలుపుదల చేశారు. దీంతో హెచ్‌పీసీఎల్ టెర్మినల్ అధికారులు ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లతో చర్చలు జరిపారు. కంపెనీ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, అనధికార వ్యక్తులను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

మూగబాలికపై అత్యాచారం

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల మూగబాలికపై ఒక కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు రక్తస్రావం జరగడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా దారుణం బయటపడింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలికకు మాటలు రాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటోంది. బాలిక కుటుంబానికి పరిచయస్తుడైన వాడమొదలు శ్రీనివాసరావు (30) పెయింటింగ్ పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో ఉంటున్నాడు. ఈనెల మూడో తేదీన బాలిక వీధిలో ఆడుకుంటుండగా శ్రీనివాసరావు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక భయపడిపోయింది. బాలికకు రక్తస్రావం జరగడంతో బుధవారం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ గట్టిగా ప్రశ్నించేసరికి అసలు విషయం బయటపడింది. దీంతో బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావుపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు సమాచారం. పోలీసులను వివరణ కోరగా బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని, నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

రైల్వే స్టేషన్‌లో 35 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫరీద్ సాహ తన సిబ్బందితోపాటు ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్ కలిసి ప్లాట్‌ఫామ్‌లపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో డెహ్రాడూన్‌కు చెందిన డానిష్ అనే వ్యక్తి రైల్లో గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.లక్ష 60 వేలు విలువ చేసే 35 కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకుని జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడుకు అప్పగించారు. నిందితుడు డానిష్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పుదుచ్చేరిపై రైల్వేస్ విజయం

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టోర్నీలో భాగంగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో రైల్వేస్ ఆరు వికెట్ల తేడాతో పుదుచ్చేరిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 175 పరుగులు చేసింది. ఆకాశ్ కర్గేవ్ హాఫ్ సెంచరీ (58) సాధించగా అరుణ్ కార్తీక్ (30), అజయ్ అరోరా (21), జశ్వంత్ శ్రీరామ్ (21), సిదక్‌సింగ్ (20) రాణించారు. రైల్వేస్ బౌలర్ కునాల్ యాదవ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రైల్వేస్ 13.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 178 పరుగులతో సునాయాసంగా విజయం సాధించింది. రవి సింగ్ (56), అశుతోష్ శర్మ (50) అజేయ అర్ధ సెంచరీలు సాధించగా.. ఓపెనర్లు శివం చౌదరి (24), సూరజ్ (27) రాణించి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు.

రుషికొండలో బోటుషికార్ పునఃప్రారంభం



బోటు షికార్‌కు వెళ్తున్న పర్యాటకులు

సాగర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోటు షికార్ గురువారం రుషికొండ బీచ్‌లో పునఃప్రారంభమయింది. తుపాన్ కారణంగా కొద్దిరోజులుగా నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో గురువారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. కాగా సందర్శకులు బోటుషికార్‌తో ఉల్లాసంగా గడిపారు.